J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 20
THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 41 సంచిక : 02 18.6.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## ప్రక్షాళన దిశగా జగన్ అడుగులు

# నోరు అదుపులో పెట్టుకోవాలి

- సొంత పార్టీ నేతలపై సిఎం సీరియస్
- అమ్మా నాన్నల గురించి మాట్లాడకండి



"సొంతపార్టీ సానుభూతిపరులను సైతం, ఆకురౌడీలను పెట్టి కొట్టించే ప్రయత్నం, అవసరమైతే చంపడానికైనా సిద్ధపడడం"

"వై.యస్ కుటుంబానికి అత్యంత సన్నిహితులైన వ్యక్తులకు సంబంధించిన సంస్థలను సైతం, నేను తల్చుకుంటే రేపు సాయంత్రానికి మూయించేస్తానని, వార్నింగ్‌లు ఇవ్వడం"

"తొడకొట్టడాలు, మీసాలు మెలివేయడాలు. అంతటితో ఆగితే పరవాలేదు అసలు ఈ పార్టీలతో మనుషులతో సంబంధమే లేని అమ్మానాన్నలను, గతించి పోయిన పాతతరం పెద్దలను ఉటంకిస్తూ నీచాతినీచమైన బూతుపదాలను వల్లించడం."

"ప్రెస్ మీట్లు , సామాజిక మాధ్యమాలు వేదికగా సంసారులు వినలేని అలబర భాషతో నోటికి అడ్డు అదుపు లేకుండా మాటల దాడి చేయడం."

ఇదీ ఇప్పుడు నవ్యాంధ్రలో పరిస్థితి. ఇవన్నీ ఏ ద్వితీయ – తృతీయశ్రేణి నాయకులో చేయడంలేదు. సాక్షాత్తూ మంత్రులు, శాసనసభ్యులే ఈ దుష్ట సంస్కృతికి తెరలేపారు. ఆలా అని అందరూ ఆలా లేరు. కేవలం కొంతమంది మాత్రమే ఈ 'బూతు బాట' అనుసరిస్తున్నారు. రాష్ట్రంలో శృతిమించుతున్న 'బూతు పురాణాలపై' ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కూడా మనస్తాపం చెందినట్లు విశ్వసనీయ సమాచారం. పార్టీ, ప్రభుత్వ సిద్ధాంతాలపై విమర్శలు, ప్రతివిమర్శలు ఉండాలి తప్ప ఇలా తల్లి తండ్రుల గురించీ, ఎప్పుడో

2 లో



# సిఎం సీరియస్

(మొదటి పేజీ తరువాయి)

మరణించిన వారి గురించి ఉటంకిస్తూ మాటల దాడి చేయడం సబబు కాదని జగన్ అభిప్రాయపడ్డారని వార్త. దీనిపై సీరియస్‌గా స్పందించిన సిఎం నోర్లు అదుపులో పెట్టుకోవలసిందిగా పార్టీ పెద్దల ద్వారా పై క్యాటగిరి నాయకులందరికీ సందేశం పంపారని అంటున్నారు.

## మానవీయ మహామతి - యువతరం ఆశాజ్యోతిగా జగన్

అపార ప్రజాదరణ, ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చెరిగిపోని చరిష్మా వున్న తన తండ్రి డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డిని జగన్ ఆకస్మికంగా పోగొట్టుకున్నారు. 10 సంవత్సరాలపాటు ఒంటరి పోరాటం చేశారు. విభజనాంధ్రలో 3648 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్ర ద్వారా 13జిల్లాలలో సమాజాన్ని అతి దగ్గరగా చూశారు. పై అంశాలన్నీ ఆయనను పరిపూర్ణ వ్యక్తిగా మార్చాయి. మానవీయత మూర్తీభవించిన మానవతావాదిగా తీర్చిదిద్దాయి. ఆయన నడక, నడతతో పాటు మాట తీరును కూడా మార్చేశాయి. ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డికి భగవద్గీత, ఖురాన్, బైబిల్ ఈ మూడూ సమానమే. ఈ మూడింటిలోనూ చెప్పేది ఒక్కటే, సూచించే మార్గమూ ఒక్కటే. అందుకే ఈ మూడూ ఇప్పుడు ఆయనకు మార్గదర్శకాలు. తప్పులు చేసిన వారిని క్షమించే గుణం, ఆపదలో ఉన్నవారిని ఆదుకునే అలవాటు, మాట తూలకుండా విమర్శ చేసే శైలి, అన్నింటినిమించి ఓర్పుగా వ్యవహరించే తత్త్వం ఆయన సొంతం చేసుకున్నారు. మానవీయ మహామతిగా యువతరం ఆశాజ్యోతిగా ఇప్పుడు జగన్ అవతరించారు.

అలాంటి వ్యక్తికి ఇప్పుడు ఈ బూతు కేటగిరి నాయకులు అపఖ్యాతి తెస్తున్నారన్న వార్త ఆ నోటా ఈ నోటా పాకి ఇప్పుడు సిఎం చెవిన పడ్డట్లుంది. వీళ్ళ రచ్చ ఆయనకు మచ్చ కాబోతుందని ఇంటిలిజెన్సు వర్గాలు కూడా ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చినట్లు భోగట్టా. వైసిపి నేతల తీరును సామాజిక మాధ్యమాలలో చూస్తున్న ముఖ్యమంత్రి పేషీ అధికారులు సైతం విస్మయం చెంది, విషయాన్ని చిన్నగా సిఎం దృష్టికి తీసుకెళ్లారని టాక్.

అందుకే కాబోలు గడచిన రెండేళ్లుగా రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు చేసుకుంటున్న మాటల దాడిపై ఇప్పుడు జగన్ ఫోకస్ పెట్టారట. ముఖ్యంగా అధికారపార్టీ నేతల మాటలు శృతి మించుతుండడంతో ఆయన వీరిని అదుపు చేసే దిశగా ఆదేశాలిచ్చినట్లు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా నామినేషన్ల పదవుల పంపిణీ పండుగ జరగనున్న తరుణంలో తరచూ పార్టీ నాయకులతో సమావేశమవుతున్న జగన్, ఈ విషయాన్ని కూడా ప్రస్తావించారని తెలిసింది. ఆయా జిల్లా మంత్రులతోనూ, ఇన్‌చార్జిలతోను చర్చించి తమ పార్టీ నేతల నోర్లు అదుపు చేసుకోమని సూచించవలసిందిగా సిఎం ఆదేశాలిచ్చారట. ముఖ్యంగా ఎవరు కూడా అమ్మా - నాన్నలతో పాటు ఇతర కుటుంబసభ్యులను తమ దూషణల పరిధిలోకి తేవద్దని, అది మంచి సంప్రదాయం కాదని గట్టిగానే మందలించమన్నారని అంటున్నారు.

## తిట్టడమే అర్హత అనుకుంటున్నారు...

ఎదుట పార్టీ వారిని తామెంత ఎక్కువగా బూతులు తిడితే తమకు ముఖ్యమంత్రి దగ్గర అన్ని మార్కులు పడతాయనుకుంటున్న వారికి ఇప్పుడు జగన్ ఆదేశాలు చెంపపెట్టు కాబోతున్నాయని చెప్పవచ్చు. జగన్ పుణ్యమా అని అధికార హోదాలో ఉన్న ఈ ఘనులు తమ గత జీవితాలు మర్చిపోలేకపోతున్నారు. స్థాయి మరచి మాటల దాడి చెయ్యడం, కెమెరాల ముందు వీరంగం వేయడం అదనపు అర్హతగా భావిస్తున్నారు. వీళ్ళు చేస్తున్న లేకి పనుల వల్ల తమ నాయకుడికి వచ్చే అపఖ్యాతిని గుర్తించలేక పోతున్నారు.

## జగన్ నిర్ణయం హర్షణీయం..!

ఇప్పుడు ముఖ్యమంత్రి జగన్ తీసుకున్న నిర్ణయం హర్షణీయం. రాబోయే రోజులలో బూతుమాటలకు, తమ సహజ గుణానికి స్వస్తి పలికి ప్రజల శ్రేయస్సు కోసం కష్టపడేవారికే పట్టం కట్టేలా జగన్ స్పష్టమైన సంకేతాలివ్వాలి. ఉచ్ఛం నీచం మరచి దిగజారుడు వ్యాఖ్యలతో ముఖ్యమంత్రిని అప్రతిష్ట పాలు చేస్తున్న వారిని ఆయన దూరంగా పెట్టాలి.

# శ్రీసిటీలో తిరుపతి ఎంపీ గురుమూర్తి




తిరుపతి ఎంపీ డాక్టర్ ఎం.గురుమూర్తి ఈ నెల 15న శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి, పారిశ్రామిక ప్రగతిని తెలియచేయడంతో పాటు ఈ ప్రాంతంలో కరోనా వైరస్ వ్యాప్తిని నివారించేందుకు చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. శ్రీసిటీలో మౌళిక వసతులు, వ్యాపారానుకూల వాతావరణం ఎంతో బాగుందన్న ఎంపి గురుమూర్తి, శ్రీసిటీ ప్రభావంతో ఈ ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలు బాగా పెరిగాయని ప్రశంసించారు. శ్రీసిటీని కరోనా రహిత జోన్‌గా నిలిపేందుకు శ్రీసిటీ మరియు పరిశ్రమల యాజమాన్యాలు చేస్తున్న కృషికి, ఇక్కడ యువతకు శిక్షణతో పాటు ఉపాధి కల్పిస్తున్న తీరుకు సంతోషం వ్యక్తం చేశారు.

## కరోనా కలవరపెడుతూనే ఉంది

జిల్లాను కరోనా మహమ్మారి ఇంకా కలవరపెడుతూనే ఉంది. కరోనా కేసులు తగ్గుముఖం పట్టినట్లు కనిపిస్తున్నా, లోలోపలే కోవిడ్ విజృంభిస్తూనే ఉంది. ఈనెల 16న ఒక్కరోజే 6885 మందికి కోవిడ్ పరీక్షలు చేస్తే వారిలో 364 మందికి కరోనా వచ్చినట్లు నిర్ధారణ అయింది. కాగా, కరోనా బారిన పడినవారిలో ఇద్దరు మృతి చెందడంతో, జిల్లాలో ఈ వ్యాధితో మొత్తంగా మృత్యువాత పడినవారి సంఖ్య 880కి చేరుకుంది. జిల్లాలో ఇప్పటిదాకా 1,24,142 మంది కరోనా బాధితులు కాగా, అందులో 1,18,669 మంది వైద్యుల చికిత్సల పుణ్యమా అని కోలుకుని తిరిగి ఇళ్ళకు వెళ్ళడం సంతోషదాయకం.




● పుర పాలకుల నిర్వాకం



## లక్షల లీటర్ల మంచినీళ్లు
# నెలల తరబడి నేలపాలు

➤ ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోని అధికారులు

***నెల్లూరు నగరంలో మాగుంట లే అవుట్‌గా ప్రాచుర్యం పొందిన మాగుంట సుబ్బరామిరెడ్డి నగర్(యంయస్‌ఆర్ నగర్)లో గత ఆరు నెలలుగా రోజూ కొన్ని లక్షల లీటర్ల త్రాగునీళ్ళు నేలపాలవుతున్నాయి. లే అవుట్‌లోని రెండవ మెయిన్ రోడ్డులో ఈ దృశ్యం రోజూ లే అవుట్ వాసులను బాధకు గురిచేస్తోంది.***

వివరాలలోకి వెళ్తే....

లే అవుట్ మొత్తం అండర్ గ్రౌండ్ డ్రైనేజి వ్యవస్థ నిర్మాణం పూర్తి చేసుకుంది , కానీ ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. లే అవుట్‌లో ప్రతిరోజూ రెండుగంటల పాటు త్రాగునీళ్ళు వదులుతారు. అయితే, ఎక్కడ లోపం జరిగిందో తెలియదు కానీ ఆ నీళ్లు వదిలినంత సేపు డ్రైనేజి మ్యాన్‌హోల్ నుండి కొన్ని వేల లీటర్ల నీళ్ళు వృధాగా పోతున్నాయి. ఈ విషయాన్ని స్థానిక నేతల దృష్టికి, మునిసిపల్ అధికారుల దృష్టికి లే అవుట్ వాసులు, అసోసియేషన్ సభ్యులు ఎన్నిసార్లు తీసుకువెళ్లినా వారికి చీమ కుట్టినట్లైనా లేదు.

"డ్రాప్ డెడ్ ఫౌండేషన్" వంటి స్వచ్ఛంద సంస్థలను స్థాపించి 'అబిత్ సూర్తి' లాంటి సామాజిక సేవకులు ఒక్క చుక్క నీటిని కూడా వృధా చేయకండి అంటూ సమాజానికి నీటి విలువను తెలుపుతూ స్ఫూర్తిని కలిగిస్తుంటే... మన దగ్గర మాత్రం ఇలా నిర్లక్ష్యానికి సాక్ష్యంగా రోజూ కొన్ని వేల లీటర్ల త్రాగునీళ్ళు మట్టిపాలవుతున్నాయి. త్రాగునీటి పైపుకి జరిగిన డామేజీ కారణంగా, డ్రైనేజి మ్యాన్‌హోల్లో నుండి లీకవుతున్న నీళ్ల సమస్యని యువ మునిసిపల్ కమిషనరైనా పట్టించుకొని ఈ లీకుకి బ్రేకు వెయ్యాలని స్థానికులు కోరుతున్నారు.

## శ్రీవారి సేవలో మరో ఏడాది
# వై.వి బృందం



తిరుమల తిరుపతి దేవస్థానాల ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా వై.వి.సుబ్బారెడ్డి పదవీ కాలం గడువు మరికొద్ది రోజులలో ముగియబోతోంది. ఆయన సారధ్యంలోని బోర్డు ఏర్పడిన కొద్ది రోజులకే కరోనా ప్రపంచాన్ని ఆవహించిన సంగతి తెలిసిందే. ఈ తరుణంలో తిరుమలలో చేపట్టదలచిన అనేక కీలక సంస్కరణలకు బ్రేకులు పడిన విషయం కూడా అందరికి తెలిసిన విషయమే. జరిగిన పరిణామాలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం ఉన్న ట్రస్టుబోర్డునే మరో ఏడాది కొనసాగించే ఆలోచనలో జగన్ ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుత ట్రస్టు బోర్డు సభ్యుల కోరిక కూడా అదే అనే సంకేతాలు ముఖ్యమంత్రికి అందడంతో, వై.వి బృందాన్నే మరో ఏడాది కొనసాగిస్తారని సమాచారం. ఓం నమో వేంకటేశాయ!

## సమస్యలను అధిగమించి..
# శ్రద్ధతో పనిచేయాలి

**అధికారులు, నాయకులకు ఎమ్మెల్యే ఆనం దిశానిర్దేశం**



గడచిన పదిహేను నెలలుగా అటు కరోనా, ఇటు కొంతకాలం ఎన్నికల నిబంధనలు, కొంతమంది అధికారుల అలక్ష్యం, అలసత్వం, కొన్ని ప్రాంతాల్లో స్థలాల కేటాయింపులో జాప్యం, ఆర్థిక వనరుల ఇబ్బందులు తదితర కారణాలు అభివృద్ధి కార్యక్రమాల్లో లక్ష్యాన్ని సాధించడంలో జాప్యానికి కారణమయ్యాయని, ఇకపై అన్ని సమస్యలను అధిగమించి అందరూ శ్రద్ధగా పనిచేయాలని మాజీ మంత్రి, వెంకటగిరి శాసనసభ్యుడు ఆనం రామనారాయణరెడ్డి హితవు పలికారు. ఈనెల 16న కలువాయి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు దిశానిర్ధేశం చేశారు. జులై మొదటివారంలో కనుపూరుపల్లి సచివాలయాన్ని, కుల్లూరు పిహెచ్‌సి భవనాలను ప్రారంభిస్తామన్నారు. ప్రతి పదిహేను రోజులకొకసారి అభివృద్ధి పనులు విషయమై సమగ్రంగా చర్చిద్దామన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం ఆశయాల కోసం నూతన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలందరికీ ప్రభుత్వ సేవలు చేరువ కావాలన్న లక్ష్యంతో పని చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు విఘాతం కలగకుండా అధికారులందరూ ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలువాయిలోని బివిఎన్‌ఆర్ జడ్పీ హైస్కూల్లో నాడు-నేడు కార్యక్రమం ద్వారా కోటి రూపాయల నిధిని వెచ్చించి కొత్తగా నిర్మిస్తున్న భవనాలను, అదనపు సౌకర్యాలను, సచివాలయ భవనాల పనులను ఎమ్మెల్యే ఆనం పరిశీలించారు. అనంతరం కలువాయి గ్రామదేవత కలువాయమ్మ తల్లిని దర్శించుకుని పూజలు చేశారు.




కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' పత్రిక

40 లాయర్ YEARS

మా ఆత్మబంధువు, ఆత్మీయ సింధువు
'తుంగా రాజగోపాలన్న కలల రూపం
వారం వారం వార్తా వెలుగుల అక్షర దీపం
లాయర్
వారపత్రికకు
40వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.




ఆదాల మురళీకృష్ణారెడ్డి
చైర్మెన్
M.A.K Group
Park Citi Plaza
Road No.1, Banjara Hills, Hyderabad - 500 034
Ph: +91 40 23339595, Fax: +91 40 23339696
web : www.makprojects.com

## 'ప్రభా'తం

# అనుభవాలే గుణపాఠాలు

ఒకటి, రెండు దశల్లోనూ కరోనా వ్యాధి ఎంతో మంది పిల్లలకు కూడా సోకింది. కనుక మూడో దశలో ప్రమాదం లేదని అనుకోవడానికి వీల్లేదు. కనీసం 25 నుంచి 30శాతం మంది పిల్లలకు కరోనా ముప్పు తప్పదనే నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, ఆ ముప్పును ఎదుర్కొనేందుకు వెంటనే ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదికన ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని, మన లోపాలను, లోటుపాట్లను గుణపాఠాలుగా తీసుకుని కరోనా కట్టడికి ప్రభుత్వాలతో సహా ప్రతి ఒక్కరూ ఏకం కావాలి. కరోనాను జయించాల్సిందే. ఆ క్రిమిసంహారక యుద్ధంలో మనం గెలిచి తీరాల్సిందే!... అప్పుడే మానవాళికి మళ్లీ మహోదయం!...



ఎక్కడా పడకుండా ఉన్నవాడి కంటే.. పడి లేచినవాడు గొప్పవాడు.. అనేది ఒక సామెత. అపజయాల నుంచే విజయాలను సాధించాలన్నది అందరికీ ఒక స్ఫూర్తిదాయకమైన మాట. అందుకే అనుభవాలనే గుణపాఠాలుగా తీసుకుని ఎన్ని అవాంతరాలైనా అధిగమించి అనుకున్న లక్ష్యం సాధించాలంటారు పెద్దలు. ఇప్పుడు సరిగ్గా మనదేశానికి కూడా కావాల్సింది ఇదే. కష్టాల్లోనే ధైర్యంగా ఉండాలి. అధైర్యంతో కాక మనోస్థైర్యంతో బతకాలి. నిరాశా నిస్పృహలతో సాధించగలిగేదేమీ ఉండదు. కరోనా బారిన పడకుండా మనల్ని మనమే కాపాడుకోవాలి. అందుకు తీసుకోవాల్సిన ముందుజాగ్రత్తలన్నీ తప్పనిసరిగా తీసుకోవాలి. కంటికి కనిపించకుండా దొరికినవారిని దొరికినట్టు చంపుకుతింటున్న కరోనా మహమ్మారి వ్యాధి సకల మానవాళి జీవితాలనే అతలాకుతలం చేస్తూనే ఉంది. ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసులు దాదాపు 18 కోట్లకు చేరువవుతున్నాయంటే, అందులో సుమారు 38 లక్షల మందికి పైగానే ప్రజల ప్రాణాలను ఆ రాకాసి వ్యాధి మింగేసిందంటే పరిస్థితి ఎంత దుర్భరంగా ఉందో అర్థమవుతూనే ఉంది. మనదేశంలోనూ కరోనా బాధితుల సంఖ్య సుమారు 3 కోట్లకు చేరుకుంటోంది. ఇప్పటికే 3 లక్షలా 75 వేల మందికి పైగానే మృత్యువాత పడ్డారు. అయినా.. ఆ మహమ్మారి వ్యాధి ఇంకా విజృంభిస్తూనే ఉంది. మనదేశంలో సరైన సమయంలో లాక్‌డౌన్‌లు, కర్ఫ్యూలు విధిస్తుండడం, కోవిడ్ నిబంధనలను కఠినంగా అమలు చేస్తుండడంతో పాటు అదృష్టవశాత్తూ కోవిడ్ నిరోధానికి టీకా కూడా వచ్చేయడంతో వైద్యులు, అధికారులు, ప్రభుత్వాల పుణ్యమా అని కోట్లాదిమంది ఈ వ్యాధి నుంచి కోలుకుంటున్నారు. దేశంలో సుమారు 3 కోట్ల మంది దాకా కరోనా బారినపడితే వారిలో 2 కోట్లా 81 లక్షల మందికి పైగానే కోలుకుని ఇళ్ళకు తిరిగివెళ్ళారంటే, కంటికి కనిపించని క్రిమి ఊపిరి తిత్తుల్లో చేరి మానవాళిని అత్యంత భయంకరంగా సంహరిస్తున్న ఈ మహావిపత్తులో ఇన్ని కోట్ల మందిని బతికించుకోగలిగామంటే చిన్న విషయమేమీ కాదు. ఒక్కమాటలో చెప్పాలంటే మనమంతా కంటికి కనిపించని శత్రువుతో ఒక పెద్ద యుద్ధమే చేస్తున్నాం. అందువల్లనే ప్రస్తుతం బాధితుల సంఖ్య కూడా క్రమేణా తగ్గుతోంది. కోవిడ్ నివారణకు టీకా రావడం, దేశంలో సుమారు 26 కోట్ల మందికి పైగానే వేయడం కూడా జరిగింది. ఈ టీకా కార్యక్రమం మరింత ముమ్మరంగా జరుగుతూనే ఉంది. రెండోదశ కరోనాకు సంబంధించి టీకా విషయంలో సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోలేదనే విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో కేంద్రం వెంటనే ఆ పొరపాటుకు దిద్దుబాటు చర్యలు తీసుకోవడంతో పరిస్థితి ఇప్పుడు ఓ కొలిక్కి వచ్చింది. అయినా 130 కోట్లమందికి పైగానే ఉన్న అతిపెద్ద దేశమైన మనదేశంలో ఒకేసారి అందరికీ టీకా వేయడమంటే మాటలతో పనికాదు. వచ్చే ఏడాది మధ్యనాటికి కనీసం 70 శాతం మందికైనా టీకా వేయాలనే సంకల్పంతో పాటు, టీకా కార్యక్రమం బాధ్యతను కూడా కేంద్రమే తీసుకోవడం వల్ల ప్రజలకి ఎంతో ఊరట కలుగుతోంది. అయినా అటు కేంద్రం, ఇటు రాష్ట్రప్రభుత్వాలు కరోనా కట్టడికి టీకా వేసే కార్యక్రమాన్ని ఇప్పుడు భారీగా చేస్తూనే ఉన్నారు. అయితే, ఇప్పటివరకు పెద్దలకు వేస్తున్న టీకాలు ఇంకా చిన్న వయసు వాళ్ళ దాకా రాలేదు. కానీ కరోనా మాత్రం ఇదే అదనుగా అన్ని వయసుల వాళ్ళనీ కాటేసేందుకు కోరలు చాస్తోంది. కరోనా రెండో దశ తగ్గుముఖం పట్టిందనే కానీ, మరణాలు మాత్రం ఆగడం లేదు. ఈ నేపథ్యంలో అందరూ తక్షణం ఆలోచించాల్సిన విషయం రానున్న మూడోదశ కరోనా గురించే. రెండోదశని పూర్తి స్థాయిలో కట్టడి చేస్తూనే, మూడోముప్పును నివారించుకోవడానికి భారీ సన్నాహాలు చేయాలి. అనేకమంది నిపుణులు చెప్తున్నట్లు కరోనా థర్డ్‌వేవ్ పిల్లలపై ప్రభావం చూపితే మాత్రం పరిస్థితి మరింత భయానకంగా తయారవుతుంది. కొందరైతే పిల్లలకు మూడోదశలో పెద్ద ముప్పేమీ ఉండకపోవచ్చని కూడా అంటున్నారు. కానీ ఊహాగానాలకు ఇది సమయం కాదు. ఇప్పటికే సమయం మించిపోయింది. మూడోముప్పు ముంచుకొస్తోంది. దీని తర్వాత ఇంకా ఎన్ని దశలున్నాయో తెలియదు. ఒకటి, రెండు దశల్లోనూ కరోనా వ్యాధి ఎంతోమంది పిల్లలకు కూడా సోకింది. కనుక మూడో దశలో ప్రమాదం లేదని అనుకోవడానికి వీల్లేదు. కనీసం 25 నుంచి 30శాతం మంది పిల్లలకు కరోనా ముప్పు తప్పదనే నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, ఆ ముప్పును ఎదుర్కొనేందుకు వెంటనే ప్రభుత్వా లు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలి. అయిదేళ్ళలోపు పిల్లలున్న తల్లులకు ఇప్పుడు కోవిడ్ టీకా వేస్తుండడం మంచి పరిణామం. పెద్దలు, ముఖ్యంగా తల్లిదండ్రులు తీసుకునే జాగ్రత్తలే పిల్లలకు రక్షాకవచంగా ఉపయోగపడతాయనేది అందరికీ తెలిసిందే. అయినా..టీకా దొరక్క అనేకదేశాల్లో జనం నానా బాధలు పడుతుంటే, టీకా వేయించుకునేందుకు కూడా మనదేశంలో ఎంతోమంది మీనమేషాలు లెక్కిస్తున్నారంటే వాళ్లనేమనాలో అర్థం కాదు. టీకా అన్నివిధాలా మన ఆరోగ్యానికి సురక్షితం. కరోనా నుంచి బతికి బట్టకట్టాలంటే టీకా తప్పనిసరి. ఇంతకన్నా ఎవరికైనా ఏం చెప్పగలం?.. ఏదేమైనా, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని, మన లోపాలను, లోటుపాట్లను గుణపాఠాలుగా తీసుకుని కరోనా కట్టడికి అందరూ ఏకం కావాలి. కరోనా కట్టడికి ముందుజాగ్రత్తలే శ్రీరామరక్షగా భావించి అందరూ వాటిని పాటించాలి. ఎవరికి వారు కరోనాను తరిమికొట్టగలిగితే.. ఆ క్రిమి నిలవనీడ లేకుండా చచ్చి ఊరుకుంటుంది. అంతవరకూ తప్పదు.. యుద్ధం చేయాల్సిందే. ఆ క్రిమిసంహారక యుద్ధంలో మనం గెలిచి తీరాల్సిందే!...అప్పుడే మానవాళికి మళ్ళీ మహోదయం!...

## మానవీయతను చాటుకున్న మహిళ

### 20 గిరిజన కుటుంబాలకు బియ్యం వితరణ

ఆత్మకూరులోని 21వ వార్డుకు చెందిన మల్లిక ఇందిరమ్మ అనే మహిళ ఈనెల 14న ఆత్మకూరులో నివాసం ఉంటున్న 20 గిరిజన కుటుంబాలకి అయిదు కేజీల వంతున బియ్యం వితరణగా అందించి తన సేవాభావం చాటుకుంది. కరోనా విపత్కర పరిస్థితుల్లో గిరిజనులు పనులు లేక ఎంతో ఇబ్బందిపడుతుండడం తనకు ఆవేదన కలిగిస్తోందని, ఈ కష్టకాలంలో ఒకరికొకరు సాయంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ చిన్న సాయం చేశానని ఆమె ఈ సందర్భంగా పేర్కొంది.

## లాయర్కు.. జేజేలు

ప్రజలకు-ప్రభుత్వానికి మధ్య వారధిలా
సమస్యల పరిష్కారానికి..సారధిలా
వారం వారం పాఠకలోకాన్ని అలరించే
'లాయర్'..అక్షరయజ్ఞం అద్భుతం!

నాలుగు దశాబ్దాలు సత్యచేతనంగా నిలిచే
వార్తా కథనాలను అందించారు
మరో నాలుగు తరాలకు స్ఫూర్తిదాయకంగా
ప్రత్యేక సంచికలెన్నిటినో ఆవిష్కరించారు.

మీ సాహితీ కళారంగాల సేవతో
సరస్వతీమాత ఎంతో ఆనందిస్తుంది
మీ నిబద్ధత..అంకితభావంతో
పత్రికారంగమే పులకించిపోతోంది

అందుకే!..మనసారా అంటున్నాం
'లాయర్' అంటే మాకెంతో అభిమానమని!..
హృదయపూర్వకంగా కోరుకుంటున్నాం
నలభైఏళ్ళ 'లాయర్' ప్రస్థానం
దిగ్విజయంగా ముందుకు సాగాలని!...

బొగ్గరపు రాధాకృష్ణమూర్తి
సెల్: 9885481939

## గోహత్యలను నివారించండి

### అధికారులకు బిజెపి, జనసేన నాయకుల వినతి



దుత్తలూరు మండలంలో ఇటీవలి కాలంలో గోహత్యలు అధికమయ్యాయని, కొంతమంది ఒక ముఠాగా ఏర్పడి అటవీప్రాంతాల్లో గోవులను చంపి వాటి మాంసాన్ని విక్రయిస్తున్నారని, కొన్నిచోట్ల కరెంటు తీగలు పెట్టి గోవుల్ని హతమారుస్తున్నారని, ఈ దారుణాలను వెంటనే అరికట్టాలని స్థానిక బిజెపి, జనసేన నాయకులు అధికారులను కోరారు. ఈ విషయమై ఈనెల 14న దుత్తలూరు తహశీల్దారు జయవర్ధన్‌కు, ఎస్‌ఐ జంపానికుమార్‌కు వారు వినతిపత్రాలు సమర్పించారు. గోవులను హతమార్చేవారిని శిక్షించాలని, వాటిని రక్షించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల కన్వీనర్ చుండి హరగోపాల్‌రెడ్డి, రాష్ట్ర అంత్యోదయ మునిసిపల్ కో-కన్వీనర్ మేకపాటి మాల్యాద్రినాయుడు, జనసేన నాయకులు మధు, లిఖిత్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అన్నం పెట్టిన కెనరాబ్యాంక్ ఉద్యోగులు

కరోనా నేపథ్యంలో పనులు లేక జీవనానికి ఇబ్బందులు పడుతున్న కావలి రూరల్ మండలంలోని బుడంగుంట గ్రామంలో ఉన్న 120 మంది నిరుపేద గిరిజన కుటుంబాల వారికి కావలిలోని కెనరాబ్యాంక్-2 ఆధ్వర్యంలో ఉద్యోగులు సిబ్బంది అందరూ కలసి అన్నం ప్యాకెట్లు, మంచినీటిని అందజేసి తమ సేవాభావం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ రమణయ్య, మేనేజర్ కంచర్ల ప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ కెబి మురళి, బిజినెస్ కరెస్పాండెంట్ మహేంద్రబాబుతో పాటు సిద్ధీశ్వర్, పోతురాజు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'లాయర్' శైలి ఎంతో బాగుంటుంది




'లాయర్'లో వచ్చే వార్తలు కానీ, వార్తా కథనాలు కానీ ఎంతో బాగుంటున్నాయి. చాలా వ్యాసాలు వాస్తవాలకు దగ్గరగా ఉంటాయి. 'లాయర్'లో వచ్చే విశ్లేషణలు, ప్రత్యేకించి మొదటి పేజీ వార్తలు ఎంతో ఆలోచనాత్మకంగా ఉంటున్నాయి. చెప్పదలచుకున్నదేదో కుండబద్దలు కొట్టినట్లు సూటిగా, స్పష్టంగా చెప్పడం 'లాయర్' ప్రత్యేకత. చదివేటప్పుడు చాలా సరళంగా అనిపిస్తుంటుంది. చిన్నపిల్లలు కూడా అర్థం చేసుకునే సులభ శైలిలో, కొంత నెల్లూరు భాష, యాసతో కలిపిన ప్రత్యేకమైన 'లాయర్' స్టైల్ ఆకట్టుకుంటోంది. పొందికగా ఉండే భాషతో, ప్రతి పేజీ చూడముచ్చటగా ఉండడమే కాక, రంగు రంగులలో పత్రిక గెటప్ కూడా అందంగా ఉంటుంది. మఖలో పుట్టి పుబలో కనుమరుగయ్యే పత్రికలు నెల్లూరు జిల్లాలో బోలెడన్ని. కానీ నలభై ఏళ్ళుగా వారం వారం క్రమం తప్పకుండా 'లాయర్' వస్తూనే ఉందంటే గొప్ప విషయం. ఇదే స్ఫూర్తితో 'లాయర్' నడవాలని, చిరకాలం వర్ధిల్లాలని మా ఆకాంక్ష.

నలభై వసంతాల 'లాయర్'కు శుభాకాంక్షలు.

డా॥ ఎం. పెంచల్‌రెడ్డి, నెల్లూరు.

## చదివితే 'లాయర్'నే చదవాలి

తింటే గారలే తినాలి..వింటే భారతం వినాలి..అన్నట్లుగా 'చదివితే 'లాయర్'నే చదవాలి' అనిపించుకునేంతగా 'లాయర్' మా ఇంటిల్లిపాదినీ ఎంతగానో ఆకట్టుకుంటోంది. సాధారణంగా పత్రికలు రాజకీయాలకే అత్యధిక ప్రాధాన్యత ఇస్తుంటాయి. కానీ రాజకీయాలతో పాటు, సమాజంలో ఎంతో ముఖ్యమైన మానవీయమైన విషయాలు, సామాజికపరమైన విషయాలకు కూడా 'లాయర్' పెద్దపీట వేయడం సంతోషదాయకం. అంతేకాదు సేవాభావంతో ఎంతోమంది దాతలు చేస్తున్న కార్యక్రమాలు 'లాయర్'లో మంచి ప్రాధాన్యతతో కనిపిస్తాయి. అందులోనూ ఈ కరోనా కష్టకాలంలో దాతృత్వంతో పాటు సమాజసేవా భావం కూడా బాగా పెరిగింది. కష్టాల్లో ఉన్నవారికి చేతనైనంత సాయం చేయాలనే ఆలోచన మునుపటికంటే ఇప్పుడు అధికమైంది. ఇది చాలా మంచి పరిణామం కూడా. సమాజసేవా భావాన్ని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలకు 'లాయర్' ప్రాధాన్యత ఇచ్చి ప్రచురిస్తుండడం ఎంతో స్ఫూర్తిదాయకం!..

'లాయర్'కు శుభాభినందనలు!

కె.వి.ఎల్.నారాయణ, హైదరాబాదు.



కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' పత్రిక

నాలుగు దశాబ్దాల వార్తా వీచిక
నెల్లూరు కబుర్ల కమనీయ వేదిక
లాయర్
వారపత్రికకు
40వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.



పొంగూరు నారాయణ
మాజీ మంత్రివర్యులు
వ్యవస్థాపక చైర్మెన్
నారాయణ విద్యాసంస్థలు
నారాయణ హాస్పిటల్స్

# శ్రీసిటీ పరిశ్రమల ఔదార్యం!

- కోవిడ్ కేంద్రాలకు కోటి విలువైన వైద్యపరికరాల వితరణ
- రెండు జిల్లాల పోలీసులకు ఎన్-95 మాస్కులు, శానిటైజర్లు

పరిశ్రమల కేంద్రంగా అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన శ్రీసిటీ మరోసారి తన దాతృత్వం చాటుకుంది. కోవిడ్ బాధితులను ఆదుకునేందుకు అక్షరాలా కోటి రూపాయల విలువైన వైద్యపరికరాలను శ్రీసిటీలోని పరిశ్రమల సహకారంతో వితరణగా అందించి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన మానవీయ హృదయాన్ని చాటుకున్నారు. నెల్లూరు, చిత్తూరు జిల్లాల పోలీసులకు కోవిడ్ వైరస్ నుంచి రక్షణగా 35వేల ఎన్-95 మాస్కులను, శానిటైజర్లను శ్రీసిటీ యాజమాన్యం తనవంతు సాయంగా అందించింది. శ్రీసిటీ పరిశ్రమ యుఎస్‌జి బోరల్ ప్లాంట్ హెడ్ షెకావత్ ద్వారా ఈనెల 15న శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సమక్షంలో చిత్తూరు అడిషనల్ ఎస్పీ డివిఎన్ మహేష్‌కు వాటిని అందజేశారు. అదే విధంగా జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్‌కు కూడా శ్రీసిటీ ప్రతినిధులు మాస్కులు, శానిటైజర్లను అందించారు. గతవారంలో శ్రీసిటీలోని వెస్ట్ ఫార్మా, యుఎస్‌జి బోరల్, థెర్మాక్స్, బ్రేక్స్ ఇండియా తదితర పరిశ్రమలతో కలసి శ్రీసిటీ ఫౌండేషన్ ద్వారా జిల్లాలోని పలు కోవిడ్ కేంద్రాలకు కోటి రూపాయల విలువైన ఆవిరి యంత్రాలు, సిలిండర్లు, ఆక్సోమీటర్లు, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు, ఫ్లోమీటర్లు, ఆక్సిజన్ మాస్కులు, కాథెటర్లు, పిపిఇ కిట్లు, మాస్కులు, గ్లౌజులు, ఆసుపత్రులకు బెడ్స్ వగైరాలను పంపిణీ చేశారు. నెల్లూరు, సూళ్ళూరుపేట, చిత్తూరు, గంగాధరనెల్లూరు, సత్యవేడు, తిరుపతి,



పుంగనూరు, బి.కొత్తకోట, విశాఖ, తమిళనాడులోని గుమ్మిడిపూండి కోవిడ్ చికిత్సా కేంద్రాలకు వాటిని వితరణగా అందజేశారు. అంతేకాక సత్యవేడు కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో ఎంతోకాలం నుంచి నిరుపయోగంగా ఉన్న అంబులెన్స్‌కి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెచ్చారు. చిత్తూరు, నెల్లూరు, గుమ్మిడిపూండిలలో పోలీసు సిబ్బందికి ఎన్-95 మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేశారు.

## ఈ సహకారాన్ని మా కర్తవ్యంగా భావిస్తున్నాం

**- శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి**

శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ కరోనాపై పోరులో ప్రభుత్వం చేస్తున్న కృషికి సహకారం అందించడం తమ కర్తవ్యంగా భావిస్తున్నామని, ప్రజాప్రతినిధుల సలహాలతో స్థానిక వైద్య అవసరాల కోసం శ్రీసిటీ పరిశ్రమల సహకారంతో వైద్యపరికరాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలకు సహాయ సహకారాలందించేందుకు ముందుకొచ్చిన పరిశ్రమల సిఇఓలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు చెప్పారు. శ్రీసిటీ వితరణలను తెలుసుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి కరోనా బాధితుల కోసం శ్రీసిటీ చేస్తున్న సేవలను కొనియాడుతూ శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డిని, పరిశ్రమల విభాగాల సిఇఓలను అభినందించారు. అవసరానికి తగిన సాయం అందిస్తూ శ్రీసిటీ అందరి ప్రశంసలను అందుకుంటోందని, కష్ట సమయాల్లో శ్రీసిటీ సాయం అందించేందుకు ఎప్పుడూ ముందుంటుందని ఈ వితరణలతో మరోసారి రుజువైందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు.

# కొత్త పన్నుల బాదుడు తగ్గించండి బాబోయ్

**సిపిఐ ఆందోళన**




ఆస్తి విలువ ఆధారంగా పన్నులు పెంచడం వల్ల ప్రజల మీద అదనపు భారం పడి ఇబ్బందులకు గురవుతారని, ప్రభుత్వం వెంటనే పునరాలోచించి ఆ పన్నులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) ఆధ్వర్యంలో ఈనెల 15న నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నాందోళన నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ ప్రభాకర్, సింహపురి ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్రసాయి మాట్లాడుతూ కరోనా ప్రభావంతో ఇప్పటికే అన్ని రంగాల ప్రజలు తీవ్రమైన ఆర్థికభారంతో అష్టకష్టాలు పడుతుంటే ఆస్తి విలువ ఆధారంగా ప్రభుత్వం కొత్తగా పన్నులు మోపడం బాధాకరమన్నారు. అసలే నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోలు డీజల్ ధరలు పెరిగిపోయి సామాన్యులు, నిరుపేదలు బతకలేని పరిస్థితి దాపురించిందని, గోరుచుట్టుపై రోకటిపోటు అన్నట్లుగా ఇప్పుడు మళ్ళీ పన్నుల మోతతో ప్రజలను బాధించడం సరికాదన్నారు. ఇప్పటిదాకా తాము కట్టుకున్న ఇళ్ళకు మాత్రమే పన్నులు చెల్లించే వారి నుంచి ఖాళీగా ఉన్న స్థలాలకు, చెత్తకు కూడా యూజర్‌చార్జీల పేరుతో ప్రతిఏటా అదనపు రుసుము వసూలు చేయబోతున్నారని, ఈ పన్నులు ఎలా కట్టాలని ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. కార్పొరేషన్ పరిధిలో నివాస గృహాలకు సంబంధించి 0.1 నుంచి 2.0 శాతం దాకా ఆస్తివిలువలో పన్నును నిర్ణయిస్తున్నారని, అందువల్ల అదనంగా 10 నుంచి 15శాతం దాకా అదనపు మొత్తం చెల్లించాల్సి ఉంటుందని, ఈ కొత్త పన్నుల విధానాన్ని ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారని, వెంటనే 196, 197, 198 జిఓలను ఉపసంహరించుకోవాలన్నారు. లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. సిపిఐ నాయకులు వి.రామరాజు, షేక్ షానవాజ్, ఎన్ రమణయ్య, పత్తి చంద్ర, వాటంబేటి నాగేంద్ర, స్టాలిన్‌బాబు, విద్యార్థి యువజన సంఘం నాయకులు మస్తాన్, సిరాజ్, సునీల్, మున్నా, ఏఐటియుసి నాయకులు రోసిరెడ్డి, ఆదినారాయణ, ముక్తియార్, న్యాయవాదులు ప్రత్యూష్, అజయ్‌కుమార్, శ్రీధర్, జగదీష్ పాల్గొన్నారు.



# జమ్మూలో కొలువుదీరనున్న కోనేటిరాయుడు



దేశవ్యాప్తంగా హిందూ ధర్మ ప్రచారమే ధ్యేయంగా తిరుమల తిరుపతి దేవస్థానాల వారి ఆధ్వర్యంలో అనేక చోట్ల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాలను నిర్మించాలని టిటిడి కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో జమ్మూకు దగ్గర్లో ఉన్న మజీన్ అనే గ్రామంలో శ్రీవారిఆలయ నిర్మాణానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. దాదాపు 33.22 కోట్ల రూపాయలు వెచ్చించి ఈ ఆలయాన్ని సర్వాంగసుందరంగా నిర్మించనున్నారు. ఈనెల 13న తిరుమల తిరుపతి దేవస్థానాల బోర్డు ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి ఈ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా యాగశాల నిర్మించి ప్రత్యేకపూజలు చేశారు. అర్చకులు, వేదపండితులు తొలుత గణపతి పూజ చేసి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్నిప్రతిష్ట, వాస్తుహోమం నిర్వహించారు. టిటిడి బోర్డు ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి, ఇ.ఓ జవహర్‌రెడ్డి యాగశాలలోని కలశజలాలను శంకుస్థాపన ప్రాంతానికి తీసుకువచ్చి శిలను అభిషేకించారు. అనంతరం అర్చకులు శిలాన్యాస పూజలు చేసి శ్రీ మహావిష్ణువును ఆరాధించి శిలను భూమిలో ప్రతిష్ఠించి పూజలు చేశారు. జమ్ము–కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి, కేంద్ర సహాయమంత్రి డాక్టర్ జితేంద్రసింగ్, ఎంపి జగల్ కిషోర్‌శర్మ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు రామ్‌మాధవ్, టిటిడి పాలకమండలి సభ్యుడు గోవింద హరితో పాటు స్థానిక నాయకులు, అధికారులు ఈ భూమిపూజలో పాల్గొన్నారు. ఆ తర్వాత ఆలయ నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

## 33.22 కోట్లతో శ్రీవారి ఆలయం

### - భూమిపూజ చేసిన టిటిడి ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి



### రాతి కట్టడాలతోనే ఆలయం

జమ్ములో శ్రీవారి ఆలయాన్ని దేశంలోని దక్షిణాది ప్రాంతాల్లో నిర్మించినట్లుగానే రాతి కట్టడాలతో నెలకొల్పనున్నట్లు వైవి సుబ్బారెడ్డి తెలిపారు. 33.22 కోట్ల రూపాయల వ్యయంతో ఆలయ నిర్మాణానికి అనుమతులు మంజూరుచేశామని, తొలిదశలో 27.72 కోట్లతో శ్రీవారి ఆలయం, ఆలయ ప్రాంగణంలో ఉపాలయాలు, వాహన మండపం, నాలుగు మాడా వీధులు, యాత్రికులకు వసతి గృహాలు, సిబ్బందికి నివాస వసతి తదితరాలను ఏర్పాటు చేయనున్నామని పేర్కొన్నారు. రెండోదశలో వేదపాఠశాల, అభ్యాసకులకు వసతి భవనాల సదుపాయాలు, కల్యాణమండపం, ఆరోగ్య కేంద్రం వగైరాలను నిర్మించాలని ప్రణాళిక రూపొందించామన్నారు. ఆలయప్రాంగణంలో భక్తులకు వసతితో పాటు వేద పాఠశాల, ధ్యానకేంద్రం. సిబ్బందికి నివాస సదుపాయాలు కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వివరించారు.

### దేశవ్యాప్తంగా హిందూ ధర్మప్రచారమే టిటిడి ధ్యేయం

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో దేశవ్యాప్తంగా హిందూ ధర్మప్రచారం నిర్వహించేందుకు టిటిడి పాలకమండలి నిర్ణయించిందని ఈ సందర్భంగా టిటిడి బోర్డు ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా శ్రీ వేంకటేశ్వరుని దేవాలయాలను నిర్మించాలని సంకల్పించామని, కన్యాకుమారిలో ఇప్పటికే శ్రీవారి ఆలయాన్ని నిర్మించడం జరిగిందని ఆయన తెలిపారు. టిటిడి విజ్ఞప్తితో జమ్ముకశ్మీర్ ప్రభుత్వం ఆలయ నిర్మాణానికి 62.10 ఎకరాల భూమిని కేటాయించిందని పేర్కొంటూ, కోవిడ్ కారణంగా భూమిపూజ ఆలస్యమైందని, 18 నెలల్లో ఆలయ నిర్మాణాన్ని పూర్తిచేస్తామని తెలిపారు.

# పెరుగుతున్న ధరలతో.. పేదల బాధలు

### - దళిత సంఘర్షణ సమితి ఆందోళన



నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకీ పెరిగిపోతుండడంతో పేదలు, సామాన్యులు బతకలేకపోతున్నారని, ప్రభుత్వం వెంటనే ధరలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా సమితి అధ్యక్షుడు ఎస్.మల్లి ఆధ్వర్యంలో ఈనెల 14న కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. నూనెలు, పప్పులు, నిత్యావసర సరుకుల ధరలన్నీ విపరీతంగా పెరుగుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం దారుణమని, కొందరు వ్యాపారులు కరోనాను సాకుగా చూపి నిత్యావసర వస్తువుల ధరలు పెంచేస్తున్నారని, తనిఖీలు లేకపోవడంతో వ్యాపారులు తమ ఇష్టం వచ్చినట్లుగా ధరలు పెంచేస్తున్నారని విమర్శించారు. నూనెలు, పప్పుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు దీనిపై దృష్టిపెట్టి ధరలను నియంత్రించి ప్రజలను ఆదుకోవాలని కోరారు. ఈ ఆందోళనలో రత్నం, మస్తానయ్య, పి. దాసు, రమణయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# ఆ జీఓలను వెంటనే రద్దు చేయండి

## - ప్రభుత్వానికి విపక్ష నాయకుల వినతి



మంచినీటి సరఫరా, డ్రైనేజీ నిర్వహణ, మరుగుదొడ్లు, చెత్త వగైరాలపై యూజర్ చార్జీలను నిరసిస్తూ, ఆస్తి విలువను బట్టి పన్నులు వేసే విధానాల అమలు కోసం రూపొందించిన జిఓ నంబర్లు 196, 197లను వెంటనే రద్దుచేయాలని కావలిలోని అఖిలపక్ష నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈనెల 14న ఆ మేరకు సమావేశం నిర్వహించి ఆర్డీఓ శ్రీనివాసులుకు వినతిపత్రం ఇచ్చారు. పారిశుద్యం నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పన స్థానిక సంస్థలు, ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలపై పన్నులు భారం మోపడం అన్యాయమన్నారు. ఆ పన్నుల జిఓలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సహాయ కార్యదర్శి దామా అంకయ్య, నాయకులు డేగా సత్యం, చేవూరు కొండయ్య, కరవది భాస్కర్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చింతాల వెంకట్రావు, టిడిపి నాయకులు జ్యోతి బాబురావు, గుత్తికొండ కిషోర్‌బాబు, కండ్లగుంట మధుబాబునాయుడు, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం చేయడం అదృష్టం

కరోనా మహమ్మారి కారణంగా జిల్లా వ్యాప్తంగా అన్ని రక్తనిధుల్లో రక్తనిల్వలు బాగా తగ్గిపోయాయని, రక్తదానం చేయడం ద్వారా మరొకరికి ప్రాణాలు నిలపడమన్నది మన అదృష్టంగా భావించి ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని రెడ్‌క్రాస్ ఉదయగిరి శాఖ ఛైర్మెన్ ఫరూక్ ఆలీ అన్నారు. ఈనెల 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఉదయగిరిలోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు, శస్త్రచికిత్సలు జరిగినప్పుడు, రోగుల్లో రక్తహీనత కలిగినప్పుడు, గర్భిణులకు, బాధితులకు అవసరమైనప్పుడు రక్తం ఎంతో అవసరం ఉంటుందన్నారు. తలసీమియా వ్యాధి బాధితులకు రక్తదానం చేయడం ద్వారా వారి ప్రాణాలను నిలబెట్టవచ్చన్నారు. రక్తదానం చేయడం పట్ల అందరూ అవగాహన కలిగించుకుని రక్తనిల్వలు కొరత లేకుండా చూడాలని కోరారు. ఈ సందర్భంగా రక్తదాన పితామహుడు డూనాట్ చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెడ్‌క్రాస్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్యాన్సర్ ఆసుపత్రికి

# 40 వేల విరాళం

నెల్లూరులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి దాతలు తుమ్మల శరత్‌చంద్రారెడ్డి-మానసారెడ్డి దంపతులు ఇటీవల 40 వేల రూపాయల విరాళం అందించి తమ సేవా భావం చాటుకున్నారు. ఈ సందర్భంగా మానసారెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు సమీపంలోని జెఆర్ పేటకు చెందిన తమ తండ్రి కేతా చిన మస్తాన్‌రెడ్డి రెండేళ్ళ క్రితం తమ సోదరి వివాహ దినోత్సవం సందర్భంగా 50వేల రూపాయలు విరాళం అందించి తమకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. అదేవిధంగా ఇప్పుడు తమ వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకుని 40వేలు విరాళం అందించామని, ఈ విరాళాన్ని పేద క్యాన్సర్ రోగులకు వినియోగించాలని ఆసుపత్రి వారిని కోరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ అజయ్‌బాబు, హర్షవర్ధన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు. కేతా చిన మస్తాన్‌రెడ్డి దంపతులకు, వారి కుటుంబ సభ్యులకు అందరూ ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు.

# వైఎస్సార్ కంటివెలుగు

విడవలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఈనెల14న వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమం జరిగింది. కంటి సమస్యలతో బాధపడుతున్నవారిని పరీక్షించి 32మందికి కళ్ళద్దాలు పంపిణీ చేశారు. పిహెచ్‌సి వైద్యులు, వైఎస్సార్ కంటివెలుగు వైద్యులు శ్రీలేఖ, ఏఎన్‌ఎం చామంతి పాల్గొన్నారు.

# 'స్వచ్ఛ సంకల్పం' విజయవంతం కావాలి



- మంత్రి పెద్దిరెడ్డి

పల్లె ప్రాంతాలను పరిశుభ్రతకు ప్రతీకగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న 'జగనన్న స్వచ్ఛ సంకల్పం' కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేసేందుకు కృషిచేయాలని రాష్ట్ర పంచాయతిరాజ్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆకాంక్షించారు. ఈనెల 14న ఆయన ఈ కార్యక్రమం ఏర్పాట్లకు సంబంధించి అమరావతి నుంచి జిల్లాలోని సర్పంచ్‌లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జులై 8వ తేదిన ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, నూరురోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కలిగించి పల్లెలు పచ్చదనం పరిశుభ్రతతో కళకళలాడేలా తీర్చిదిద్దాలని ఆయన చెప్పారు. మన ఇళ్ళను ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో అదేవిధంగా మన గ్రామాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసుకోవచ్చని, అందుకు సర్పంచ్‌లు శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో మురుగునీటి నిల్వలు, పేడదిబ్బలు లేకుండా, ఎక్కడంటే అక్కడ చెత్తాచెదారం వేయకుండా చూసుకోవాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉంటూ గ్రామాలను ఆరోగ్యవంతంగా, పరిశుభ్రంగా ఉండేలా తీర్చిదిద్దుకోవాలని. గ్రామాలు ఆరోగ్యంగా ఉంటే ప్రజలు కూడా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు భాగస్వాములై ప్రజలకు మరింత చేరువ కావాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా పంచాయతి అధికారి ధనలక్ష్మి, జడ్పీ సిఇఓ సుశీల, జలదంకి మండలం జమ్మలపాళెం సర్పంచ్ శ్రీవేణి, అల్లూరు మండలం నార్త్ ఆములూరు సర్పంచ్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

# గంగమ్మ దేవతకు..పంచామృతాభిషేకం



మనుబోలు చెరువుగట్టున కొలువై ఉన్న గ్రామదేవత గంగమ్మతల్లికి ఈనెల 13న ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భగా అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి పంచామృతాభిషేకం చేశారు. ఈ వేడుకకు అమ్మవారి భక్తులు చింతల వెంకటేశ్వర్లు-లక్ష్మీరాజ్యం దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.




# ఆనందయ్యకు ఆదాల అభినందనలు

## – కొండ్రెడ్డి ద్వారా సందేశం



నేటి కరోనా కష్ట కాలంలో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఆయుర్వేద మందును తయారుచేసి అందిస్తున్న కృష్ణపట్నంకు చెందిన ఆనందయ్య సేవలను నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అభినందించారు. అందుకు ప్రత్యేకంగా విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డిని ఆనందయ్య వద్దకు పంపి తన తరపున శుభాభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆదాల పంపిన సందేశాన్ని ఆయన చదవి వినిపించారు. కరోనా వ్యాప్తి నియంత్రణకు అవసరమైన ఆయుర్వేద మందును గుర్తించి ఎందరో కరోనా బాధిత రోగుల ప్రాణాలను కాపాడిన ఆనందయ్య శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా వాసి కావడం గర్వకారణమన్నారు. ఆనందయ్య మందుతో నెల్లూరుజిల్లాతో పాటు మిగిలిన ప్రాంతాల ప్రజలకు కూడా కరోనా నివారణ మందును అందజేయాలని ఆయన ఈ సందర్భంగా ఆనందయ్యను కోరారు. అందుకు ఆనందయ్య స్పందిస్తూ కరోనా నియంత్రణలో భాగమైన ఆయుర్వేదం మందును అందరికీ అందజేయాలన్నదే తన ఉద్దేశమన్నారు. నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తరపున తనను కలసిన కొండ్రెడ్డి రంగారెడ్డికి, వైకాపా నాయకులు నరసింహారావు, అబూబకర్, కోటేశ్వరరెడ్డి, పాముల హరి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

# వివిఎస్‌యులో ముగ్గురు ఉద్యోగులపై వేటు

నెల్లూరులోని విక్రమసింహపురి యూనివర్శిటీలో విధుల పట్ల నిర్లక్ష్యం, ఎల్‌సిడి ప్రొజెక్టుర్‌ను అపహరించారన్న ఆరోపణలపై ముగ్గురు ఉద్యోగులను ఉద్యోగాల నుంచి తొలగించారు. ఈ విషయంపై వర్శిటీ అధికారులు విచారణ కమిటీని వేశారు. కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలని వీసీ రాజశేఖర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో వివిఎస్‌యు రిజిస్ట్రార్ ఎల్ విజయకృష్ణారెడ్డి ఆ ముగ్గురు ఉద్యోగులపై చర్యలు తీసుకుంటూ ఈనెల 15న ఉత్తర్వులు జారీచేశారు. పరీక్షల విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న స్వరూప్‌కుమార్‌ను సస్పెండ్ చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగి మదన్‌ను, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని లాస్యను విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలిచ్చారు.



## రెండోపంటకి తొలిసారిగా..

# కండలేరు జలాలు

- 2 లక్షల ఎకరాలకు సాగునీళ్ళు
- అన్నదాతల్లో ఆనందం

ఎట్టకేలకు ఇన్నేళ్ళకు కండలేరు నీళ్ళు జిల్లాలోని వేలాదిమంది రైతుల సాగుభూములకు పుష్కలంగా వినియోగంలోకి రానున్నాయి. జలాశయంలో 42 టిఎంసిల దాకా నీటి నిల్వ ఉన్న నేపథ్యంలో రైతులకు రెండోపంట సాగునీటి కోసం 20 టిఎంసిల నీటిని అధికారులు విడుదల చేయడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. రాపూరు మండలంలోని కండలేరు జలాశయం చరిత్రలోనే తొలిసారిగా రెండోపంటకి సాగునీళ్ళు అందేవిధంగా నీటిపారుదల అధికారులు చర్యలు తీసుకోవడం విశేషం. ఈనెల 14న ఆ శుభ కార్యం జరిగింది. నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో రెండు లక్షల ఎకరాల్లో రెండో పంట సాగుకు ఈ నీటిని విడుదల చేశారు. చెన్నైవాసుల దాహార్తిని తీర్చేందుకు కండలేరు జలాశయం హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు తెలుగుగంగ చీఫ్ ఇంజనీర్ హరినారాయణరెడ్డి 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు నెలాఖరు దాకా రోజుకు 500 క్యూసెక్కుల వంతున చెన్నైకి మొత్తం 4 టిఎంసిల నీటిని కేటాయించడం జరిగిందన్నారు. తుదివరకు ప్రవాహం సాగేలా నెల్లూరు, చిత్తూరు జిల్లాల రైతులు సహకరించాలని ఆయన కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జలవనరులశాఖ మంత్రి డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్‌ల కృషితో జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. జిల్లాలోని సోమశిల, కండలేరు వరద కాలువ ప్రవాహ సామర్థ్యం రోజుకు ఒక టిఎంసి మాత్రమేనని, దానిని రెండు టిఎంసిల సామర్థ్యానికి పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. అందుకు 45 కిలోమీటర్ల దాకా కాలువను ఆధునీకరించేందుకు 928 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని తెలిపారు.

## గంగమ్మ తల్లికి పూజలు

తొలుత కండలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద గంగమ్మకు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి అనంతరం స్విచ్ ఆన్‌చేసి నీటిని విడుదల చేశారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు విజయకుమార్ రెడ్డి, కృష్ణమూర్తి, డిఇ విజయరామిరెడ్డి, ఏఇలు తిరుమలయ్య, రాధాకృష్ణమూర్తి, అనిల్‌బాబు, గణేష్‌బాబు పాల్గొన్నారు.






## రక్తదానం చేయండి..
# బాధితులను ఆదుకోండి



రక్తదానంపై అపోహలు పెట్టుకోకుండా యువత రక్తదానానికి ముందుకు రావాలని, తద్వారా బాధితులను ఆదుకోవాలని నెల్లూరు రెడ్‌క్రాస్ ఛైర్మెన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా నగరంలోని రెడ్‌క్రాస్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రక్తదానం ఆవశ్యకతను వివరించారు. బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ అజయ్‌బాబు మాట్లాడుతూ రెడ్‌క్రాస్‌లో రక్తనిల్వలు తగ్గిపోయాయని, దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేయాలని కోరారు. తొలుత రక్తగ్రూపులను కనుగొన్న కార్ల్‌ల్యాండ్ స్టీనర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదాతలు, మోటివేటర్లను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. రెడ్‌క్రాస్ వైస్‌ఛైర్మెన్ దామిశెట్టి సుధీర్‌నాయుడు, రాష్ట్ర శాఖ మేనేజింగ్ కమిటీ సభ్యుడు రవిప్రకాష్, కోశాధికారి సురేష్‌కుమార్ జైన్‌లతో పాటు సభ్యులు రాజేంద్రప్రసాద్, యడవల్లి సురేష్, గంధం ప్రసన్నాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమాల్లో ఆనందయ్య మందు

నెల్లూరు బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధుల ఆశ్రమం తదితర వృద్ధాశ్రమాల్లో ఉన్న వృద్ధులకు కరోనా వైరస్ సోకకుండా ఉండేందుకు ఈనెల 14న ఆనందయ్య ఆయుర్వేద మందును ఉచితంగా పంచిపెట్టారు. ఆనందయ్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ట్రస్ట్ ప్రతినిధి దగ్గుపాటి రాధాకృష్ణతో పాటు సభ్యులు నెల్లూరు శేషు, పాలేటి రాధాకృష్ణ, తస్లీమ్, సుబ్రహ్మణ్యం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

### గూడూరు సబ్‌కలెక్టర్‌గా..
## బాపిరెడ్డికి అదనపు బాధ్యతలు



గూడూరు సబ్ కలెక్టర్‌గా ఉన్న గోపాలకృష్ణ విశాఖ జిల్లా పాడేరు ఐటిడిఏ పి.ఓగా బదిలీ కావడంతో ఆయన స్థానంలో జేసీ(ఆసరా) బాపిరెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్‌గా ఉత్తర్వులిచ్చారు. ఈనెల 14న గోపాలకృష్ణ రిలీవ్ అయ్యారు.

## గొలుసు దొంగ దొరికాడు



నెల్లూరు నగరం, రంగనాయకుల పేటలోని బులియన్ మర్చంట్స్ కళ్యాణ మండపం వద్ద నివసిస్తున్న హైమవతి అనే మహిళ ఈనెల 14వతేది మధ్యాహ్నం ఇంట్లో ఉన్న చెత్తను చెత్తకుండీలో పారబోసి తిరిగి వస్తుండగా బైక్‌పై వేగంగా వచ్చిన ఒక దుండగుడు ఆమె మెడలోని బంగారు సరుడు తెంపుకుని పారిపోయాడు. హటాత్తుగా జరిగిన ఈ సంఘటనతో ఆమె బెదిరిపోయి కేకలు వేసినా లాభం లేకపోయింది. అప్పటికే దుండగుడు దొరికినంత మేరకు దండను తెంపుకుపోయాడు. ఆమె ఆ బంగారుదండను గట్టిగా పట్టుకోవడంతో సగభాగం మాత్రమే ఆమె చేతిలో మిగిలింది. దీంతో ఆ మహిళ గోడుగోడుమంటూ పోలీసులకు ఫిర్యాదుచేసింది. దీంతో సంతపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా ఆధ్వర్యంలో పోలీసులు రెండు బృందాలుగా రంగంలోకి దిగి గాలింపు చేపట్టి 24 గంటల్లోపే నిందితుడిని అరెస్ట్ చేయడం విశేషం. నగరంలోని మన్సూర్ నగర్‌కు చెందిన మల్లెల దొర అనే వ్యక్తి చెడు వ్యసనాలకు బానిసై దొంగగా మారినట్లు పోలీసులు తెలిపారు. అతని వద్ద నుంచి 98వేల విలువ చేసే 27 గ్రాముల బంగారు సరుడును స్వాధీనం చేసుకున్నారు.

## 'మూడో ముప్పు'ను ఎదుర్కొందాం

### అధికారులతో మంత్రి డాక్టర్ అనిల్



కరోనా మూడోముప్పును అందరం కలసికట్టుగా ఎదుర్కొందామని, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ వైరస్ నుంచి ప్రజలను కాపాడడానికి అందరూ సమన్వయంతో ముందుజాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ అనిల్‌కుమార్ జిల్లా అధికారులకు చెప్పారు. ఈనెల 14న ఆయన నెల్లూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ చక్రధర్ బాబుతో కలసి టాస్క్‌ఫోర్స్ కమిటీతో సమావేశమయ్యారు. కోవిడ్ నియంత్రణ, టీకా కార్యక్రమం, కరోనా మూడో దశను ఎదుర్కోవడం తదితర అంశాలపై ఆయన చర్చించారు. రెండోదశ కోవిడ్‌లోనూ జిల్లా అధికారులు, వైద్యులు, పోలీసులు ఎంతో కష్టపడి పనిచేసి కరోనా పాజిటివ్ కేసులను, మరణాలను బాగా తగ్గించగలిగారని మంత్రి ఈ సందర్భంగా అందరినీ అభినందించారు. ఇదే స్పూర్తితో మూడోదశ కోవిడ్‌ను కూడా ఎదుర్కోవాలన్నారు. థర్డ్‌వేవ్‌లో ఒక్క బిడ్డ కూడా మరణించకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో కరోనా నివారణ కోసం నిరంతరం ముమ్మర కృషి చేస్తున్నారని, రాష్ట్రంలో 64 ఆక్సిజన్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కరోనా మూడో దశని తట్టుకునేందుకు జిల్లాలో అవసరమైన వైద్యవసతులు, పరికరాల ఏర్పాటుతో పాటు అవసరమైనంత మంది వైద్యసిబ్బందిని కూడా నియమించుకోవాలని సూచించారు. కలెక్టర్ చక్రధర్ బాబు మాట్లాడుతూ జిల్లాలో టీకా కార్యక్రమం ముమ్మరంగా జరుగుతోందని, 28 శాతం మందికి మొదటిడోసు టీకా వేయడం జరిగిందని, కరోనా పాజిటివ్ రికవరీ రేటులో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో ఉందని తెలిపారు. శిక్షణ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జేసీలు గణేష్ కుమార్, బాపిరెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్, అదనపు ఎస్పీ వెంకటరత్నం, డిఎఫ్ఓ షణ్ముఖకుమార్, డిఆర్ఓ చిన్న ఓబులేసు, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి, డిపిఓ ధనలక్ష్మి పాల్గొన్నారు.






# రాజమోహన్‌రెడ్డి పుట్టినరోజు సంబరాలు

మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఇటీవల నెల్లూరులోని ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. జిల్లాలోని అనేకమంది నాయకులు, యువత, విద్యార్థులు, అభిమానులు అందరూ ఎంతో ఉత్సాహంగా వచ్చి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. దీంతో రాజమోహన్‌రెడ్డి ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది. వైకాపా జిల్లా యువజన నాయకుడు మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నెల్లూరులోని అనేకప్రాంతాల నుంచి విద్యార్థులు, యువత తరలివచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మన రాష్ట్రం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న రోజుల నుంచి వైకాపా అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెంట ఉండి ఎన్నో కార్యక్రమాల్లో రాజమోహన్‌రెడ్డి పాల్గొన్నారని, ఎంపీగా ఆయనందించిన సేవలను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని కొనియాడారు. ప్రస్తుతం ప్రత్యక్ష రాజకీయాలకు ఆయన దూరంగా ఉన్నప్పటికీ ఉదయగిరి నియోజక వర్గానికి ఎమ్మెల్యేగా ఉన్న ఆయన సోదరుడు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి, రాష్ట్ర పరిశ్రమల మంత్రిగా ఉన్న ఆయన తనయుడు మేకపాటి గౌతంరెడ్డికి ఎల్లప్పుడూ తగు సలహాలు సూచనలు ఇస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తున్నారని అన్నారు. తన వారసునిగా విద్యావంతుడు, రాజకీయరంగంలో ఆణిముత్యంగా అందరి ప్రశంసలు అందుకుంటున్న మంత్రి గౌతంరెడ్డిని జిల్లా ప్రజలకు అందించిన ఘనత మేకపాటి రాజమోహన్‌రెడ్డిదేనన్నారు. అనంతరం అందరూ కలసి రాజమోహన్‌రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

## 632 కోట్లతో సోమశిల
# ఉత్తర కాలువ ఆధునీకరణ

నెల్లూరుజిల్లాలోని సోమశిల జలాశయం నుంచి ప్రకాశం జిల్లాలోని రాళ్లపాడు దాకా సోమశిల ఉత్తర కాలువ ఆధునీకరణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఈ పనులు పూర్తయితే 1400 క్యూసెక్కుల దాకా నీళ్ళు వృధా కాకుండా రాళ్ళపాడు దాకా ఉన్న చెరువులన్నిటినీ నింపవచ్చు. ఈ బృహత్కార్యానికి ప్రభుత్వం 632 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడంతో ఈ ఆధునీకరణ పనులను మొదలుపెట్టారు. సోమశిల జలాశయంలో 23వ కిలోమీటరు నుంచి జరుగుతున్న ఈ పనులను ఈనెల 15న తెలుగుగంగ చీఫ్ ఇంజనీర్ హరినారాయణరెడ్డి సోమశిల నాల్గవ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వెంకటరమణారెడ్డితో కలసి పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు.

## జులై 15 దాకా..
# పలు రైళ్ళ రద్దు

కరోనా నేపథ్యంలో నెల్లూరు మీదుగా వెళ్లే పలు రైళ్ళను తాత్కాలికంగా రద్దు చేశారు. బిట్రగుంట-చెన్నై సెంట్రల్ (07237), చెన్నై సెంట్రల్-బిట్రగుంట (07238) రైళ్ళను ఈనెల 16 నుంచి జూలై 15వ తేది దాకా తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు రైల్వేవర్గాలు పేర్కొన్నాయి. అదేవిధంగా చెన్నై సెంట్రల్-హైదరాబాద్ (02603), హైదరాబాద్-చెన్నై సెంట్రల్ (02604) రైళ్ళను ఈనెల16 నుంచి 30వ తేది దాకా రద్దు చేసినట్లు సమాచారం.

# మానవీయతను చాటుకున్న వేమిరెడ్డి దంపతులు

## • ప్రగతి చారిటీస్‌కు 3 లక్షల విరాళం



నెల్లూరులోని వాత్సల్య అనాధ బాలల శరణాలయానికి, ఇంకా అనేక ఆశ్రమాలకు తమవంతు సేవలందిస్తూ వేమిరెడ్డి దంపతులు తమ మానవీయతను చాటుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని ప్రగతి చారిటీస్‌లో ఉన్న మానసిక దివ్యాంగుల సంరక్షణ కోసం రాజ్యసభ సభ్యుడు, ప్రముఖ దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి, టిటిడి పాలకమండలి సభ్యురాలు శ్రీమతి ప్రశాంతిరెడ్డిలు ఈనెల 15న ప్రగతి చారిటీస్ నిర్వాహకులకు 3 లక్షల రూపాయల విరాళం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రగతి చారిటీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక దివ్యాంగుల కేంద్రానికి చేయూతగా ఈ విరాళం అందజేస్తున్నామని, గత 14 సంవత్సరాలుగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రగతి చారిటీస్ నిర్వాహకులు సుశీలమ్మ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

# 'గీతామయి'లో.. నారాయణ జన్మదిన వేడుకలు

మాజీమంత్రి, టిడిపి నేత డాక్టర్ పొంగూరు నారాయణ జన్మదిన వేడుకలు ఈనెల 15న నెల్లూరు బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమంలో తెలుగు యువత నాయకుడు డివి కృష్ణయాదవ్ ఆధ్వర్యంలో కోవిడ్ నిబంధనలను పాటిస్తూ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నారాయణ ఆసుపత్రి సిఇఓ, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి వేమిరెడ్డి పట్టాభి పాల్గొని కేకును కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. టిఎన్ఎస్ఎఫ్ నేత ప్రణయ్ కుమార్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అనిల్, విజయ్, ఆనంద్, ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు తమ్మినేని పాండు, నిర్వాహకురాలు సరళ, ఆశ్రమంలోని వయోవృద్ధులు పాల్గొని డాక్టర్ నారాయణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.




## కాలధర్మం

# వీరిశెట్టి గోపాలకృష్ణ



నెల్లూరు హోటల్ రంగంలో 'మయూరి గోపాల్'గా అందరికీ చిరపరిచితుడైన వీరిశెట్టి గోపాలకృష్ణ(68) ఈనెల15వ తేది మంగళ వారం రాత్రి 11 గంటలకు కన్నుమూశారు. కరోనా వ్యాధి బారిన పడిన ఆయన గత కొద్దిరోజులుగా నగరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందారు. కరోనా తగ్గిపోయాక కోలుకుని కొద్దిరోజుల క్రితమే ఇంటికి వెళ్ళారు. అయితే, మళ్ళీ ఆరోగ్యం క్షీణించి ఆకస్మికంగా గుండెపోటు రావడంతో ఆయన మరణించినట్లు కుటుంబసభ్యులు చెప్పారు.

దురదృష్టవశాత్తూ ఆయన భార్య కూడా 18 రోజుల క్రితమే కరోనాతో కన్ను మూయడంతో ఆయన తీవ్ర ఆవేదన చెందుతున్న సమయంలో అనారోగ్యం వచ్చిపడడం బాధాకరం. ఆయనకు ఒక కుమారుడు ఉన్నాడు. పెళ్ళయ్యాక వైద్యవృత్తిలో ఉంటూ ఏలూరులో స్థిరపడ్డారు. తల్లి-తండ్రి ఇద్దరూ మృతి చెందడంతో వారి బాధ వర్ణనాతీతం. నెల్లూరు పొగతోటలో ఉన్న రైతుడిపో సుధాకర్‌కి గోపాలకృష్ణ స్వయాన అన్న. మురళీకృష్ణ హోటల్స్ ఎం.డి వీరిశెట్టి హజరత్‌బాబుకు పెదనాన్న కుమారుడు కనుక సోదరుడవుతాడు. మయూరి హోటల్‌కు వెళ్తే చాలు 'రండి రండి' అంటూ ఎంతో ఆత్మీయంగా స్వాగతించి మంచి వంటకాలు వడ్డించేలా సిబ్బందిని పురమాయించే వారు. మనిషి ఒడ్డూపొడుగు బాగా ఉండడంతో తెల్లటి దుస్తుల్లో ఉండే ఆయన్ను ఎక్కడున్నా మిత్రులు ఇట్టే గుర్తుపట్టేవారు. మంచి మాటతీరు, కలుపుగోలుతనంతో ఆయన అందరికీ ఆత్మీయుడయ్యారు. ఆ హోటల్‌లో కొంతకాలం ఉండి ఆ తర్వాత ఇటీవలే సొంతంగా క్యాటరింగ్ పెట్టారు. వ్యాపారాభివృద్ధికి బాగా తపనపడేవారు. తాము చేసిన వంటకాలు బాగున్నాయో లేదోనని పదేపదే అడిగి ఏవైనా లోటుపాట్లుంటే సరిచేసుకునేవారు. ఎప్పుడూ భేషజానికి పోయేవారు కాదు. చిన్నా పెద్దా అందరితో బాగా కలిసిపోయేవారు. మిత్రుల పట్ల మంచి గౌరవం ఉన్న సహృదయుడాయన.

ఇంటిపేరు వీరిశెట్టి వారైనా తాను పనిచేసే హోటల్ పేరునే ఇంటిపేరుగా పిలిపించుకున్న ఘనత ఆయనది. 'మయూరి గోపాల్'గా పేరొందిన వీరిశెట్టి గోపాల కృష్ణ ఆకస్మిక మృతి ఎంతో విచారకరం. కరోనా మహమ్మారి పుణ్యమా అని వీరిశెట్టి వారి కుటుంబంలో వరుస మరణాలు సంభవిస్తున్నాయి. వారి కుటుంబసభ్యులతో పాటు వారి కుల గురువైన శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం ఆకస్మిక మరణం కూడా వీరిశెట్టి వారి కుటుంబానికి తీరని లోటు. మంచివ్యక్తి... స్నేహపాత్రుడైన ఆయన మృతికి చింతిస్తూ... ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తోంది..'లాయర్'!...

# కౌలురైతులకు.. ఇక మంచిరోజులు

## ➤ సిద్ధమవుతున్న పంట సాగుదారు పత్రాలు
## ➤ జిల్లావ్యాప్తంగా 40 వేల మందికి ప్రయోజనం

ఎంతోకాలంగా కష్టనష్టాల్లోనే సేద్యం చేసుకుంటున్న కౌలు రైతులకు మంచిరోజులు రానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పంట సాగుదారు హక్కుల చట్టంతో వారి జీవితాల్లో సరికొత్త వెలుగులు ప్రసరింపజేసేందుకు కృషి చేస్తోంది. దీంతో ఇప్పటికైనా తమ కష్టాలు తీరుతాయంటూ జిల్లాలోని కౌలు రైతు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. భూముల యజమానుల హక్కులకు కూడా ఎలాంటి నష్టం లేకుండా ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఈ పంట సాగుదారు హక్కు పత్రం (సిసిఆర్‌సి)తో కౌలు సాగుదారులకు ప్రభుత్వం నుంచి అన్ని రుణ సదుపాయాలతో పాటు సబ్సిడీ ఎరువులు, విత్తనాలు కూడా అందనుండడంతో కౌలురైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



### నెలాఖరు దాకా గ్రామసభలు :

ఈనెల 30వ తేదీ వరకు రెవెన్యూ, వ్యవసాయ అధికారులు గ్రామసభల ద్వారా ఈ ప్రక్రియను చేపట్టనున్నారు. జిల్లాలో సుమారు లక్ష మంది దాకా కౌలుదారులున్నారని ఒక అంచనా. అయితే వీరంతా భూమి హక్కుదారులు కాకపోవడంతో ప్రభుత్వ పథకాలకు దూరంగానే ఉన్నారు. పంట సాగుదారుల పత్రాలు మంజూరు కానుండడంతో వీళ్ళకి కూడా ఇకనుంచి ప్రభుత్వ పథకాలు అందనున్నాయి. అయితే ఈ కార్డులకు 11 నెలల కాలపరిమితి ఉంటుంది. కార్డుదారులకు ఉచిత పంటల బీమా, పంట నష్ట పరిహారం కూడా ఉంటుంది. గ్రామ రెవెన్యూ అధికారులు ఈ కార్డులను జారీచేస్తారు. గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా రైతు భరోసా కేంద్రం పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. దీనివల్ల కౌలుకార్డుదారులు రైతుభరోసా లబ్దిని కూడా పొందేందుకు అవకాశం ఉంటుంది.

ఈ ఏడాది జిల్లాలో సుమారు 40వేల మందికి కౌలుదారు కార్డులు అందించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు కూడా. ఈ కార్యక్రమానికి సంబంధించి కౌలురైతుల్లో అవగాహన పెంపొందించేందుకు గ్రామస్థాయిలో సదస్సులు నిర్వహించ నున్నారు. గత రెండు సంవత్సరాల్లో ఈ కార్డులను జిల్లాలో సుమారు 10వేల మంది కౌలురైతులకు అందజేసి ఉన్నారు. వాటి పునరుద్ధరణ ప్రక్రియను కూడా చేపట్టనున్నారు.

### భూముల యజమానులు సహకరించాలి

కౌలురైతులకు పంటసాగు పత్రాలను ఇచ్చేందుకు వ్యవ సాయ అధికారులు జాబితా సిద్ధం చేస్తున్నారు. ఈనెల 30వ తేది దాకా గ్రామాల్లో సభలు పెట్టి కౌలురైతులకు కార్డులిస్తామని, కౌలుదారులు భూముల యజమానుల వద్ద అంగీకార పత్రాన్ని పొందాల్సి ఉంటుందని అధికారులు చెప్తున్నారు. 11 నెలల కాలంలో పండించిన పంటకే తప్ప భూమిపై కౌలుదారులకు ఎలాంటి హక్కులు ఉండవు కనుక భూముల యజమానులు సహృదయంతో ముందుకొచ్చి కౌలురైతులకు అండగా నిలవాల్సి ఉంది. కౌలుకార్డులు ఉన్నవారికి ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ రైతుభరోసాతో పాటు వ్యవసాయానికి సంబంధించి అన్ని సంక్షేమ పథకాలు అందజేస్తారు. అంతే కాదు, ఈ కార్డులు పొందిన ఎస్సీఎస్టీ బిసి మైనార్టీ వర్గాల రైతులకు ప్రభుత్వం వచ్చే నెలలో రైతుభరోసా పథకం కింద 13,500 రూపాయలు ఆర్థికసాయం అందజేయవచ్చని కూడా సమాచారం. అందువల్ల కౌలురైతులు వ్యవ సాయశాఖ సిబ్బందిని కలసి కార్డులు పొందేందుకు తగు వివరాలు తెలియజేయాలని అధికారవర్గాలు కోరుతున్నాయి.




# పార్టీ సేవలో పతి.. సామాజిక సేవలో సతి

## ● పోటాపోటీగా ముందుకు దూసుకుపోతున్న బల్లి దంపతులు





దివంగత తిరుపతి ఎంపి బల్లి దుర్గాప్రసాద్ కుమారుడు, కోడలు ఇద్దరూ తమ తమ రంగాల్లో పోటీపడి ముందుకు సాగుతుండడం ప్రజల ప్రశంసలకు పాత్రమవుతోంది. బల్లి దుర్గాప్రసాద్ తనయుడు బల్లి కల్యాణ్ చక్రవర్తి పార్టీ కార్యక్రమాల్లో ముమ్మరంగా తిరుగుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాలతో పార్టీ అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తుంటే, కల్యాణ్‌చక్రవర్తి సతీమణి, టిటిడి ప్రధాన వైద్యసలహాదారు డాక్టర్ శ్వేత తన్నీరు సామాజిక సేవారంగంలో ముందుకు దూసుకుపోతున్నారు. వీరిరువురి అలుపెరుగని సేవలు ప్రజలను బాగా ఆకట్టుకుంటున్నాయి. ఇటీవలే ఆమె అయిదు లక్షల రూపాయల విలువచేసే కోవిడ్ ప్రొటెక్షన్ కిట్లను టిటిడి బోర్డు ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డికి అందజేశారు. టిటిడి సిబ్బందికి, టిటిడి ఆసుపత్రుల్లోని పారా మెడికల్ సిబ్బందికి, టిటిడి ఫ్రంట్‌లైన్ వర్కర్లకి మొత్తంగా సుమారు 2500 మందికి ఆ మెడికల్ కిట్లను అందజేశారు. తిరుమల అశ్వని ఆసుపత్రిలో విధులను నిర్వహించే ఫ్రంట్‌లైన్ కార్మికులకు కోవిడ్ వైరస్ నుంచి రక్షణగా మాస్కులను, శానిటైజర్లను పంపిణీ చేశారు. త్వరలో టిటిడి సెంట్రల్ ఆసుపత్రి, స్విమ్స్, బర్డ్, రుయా ఆసుపత్రుల్లో పనిచేసే సిబ్బందికి కూడా ఈ సామగ్రిని అందజేస్తామని ఈ సందర్భంగా డాక్టర్ శ్వేత తెలియజేశారు. టిటిడి బోర్డు ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డితో పాటు అశ్వని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నర్మద తదితరులు పాల్గొన్నారు.

### కరోనా బాధితులకు ధైర్యం చెప్పిన డా. శ్వేత

ఈనెల 13న డాక్టర్ శ్వేత తన్నీరు, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డితో కలసి శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రిలో వసతులను పరిశీలించారు. అనంతరం అక్కడ కరోనా బాధితులకు అందజేస్తున్న వైద్యసేవల గురించి, వారికి అందిస్తున్న భోజనం తదితర విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కరోనా బాధితులతో మాట్లాడుతూ ఎలాంటి భయానికి గురికాకుండా అందరూ ధైర్యంగా ఉండాలని చెప్పారు.

### హరికృష్ణయాదవ్ కుటుంబానికి ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ పరామర్శ :

సిఎం జగన్‌కు తొలినుంచి విశ్వసనీయమైన వ్యక్తిగా ఉంటూ నియోజకవర్గంలో పార్టీ పురోభివృద్ధికి అలుపెరుగని సైనికునిలా కృషిచేసిన హరికృష్ణయాదవ్, మరియు ఆయన తండ్రి ఇటీవల కరోనాతో మృతిచెందడంతో సిఎం జగన్ ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి హరికృష్ణయాదవ్ కుటుంబాన్ని పరామర్శించారు. చిల్లకూరు మండలంలోని చేడిమాల గ్రామంలో ఉన్న హరికృష్ణయాదవ్ మాతృమూర్తిని బల్లి కల్యాణ్‌చక్రవర్తి ఓదార్చారు. ఆయన వెంట తిరుపతి ఎంపి గురుమూర్తి, గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, చల్లా మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిఎం జగన్ సహకారంతో..

# కోవూరు రోడ్లకు మహర్దశ

**ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి**



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో కోవూరు నియోజకవర్గంలో రోడ్లకు మహర్దశ పట్టనుందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి చెప్పారు. ఈనెల 15న ఇందుకూరుపేట మండలంలోని రావూరులో ఎమ్మెల్యే పర్యటించారు. రావూరు, కొమరిక, గంగపట్నం దాకా 4.65 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన బిటి రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. రోడ్ల పనులకు 110.69 కోట్లు మంజూరయ్యాయని, కొన్ని రోడ్ల పనులు ఇప్పటికే ప్రారంభం అయ్యాయని తెలిపారు. మరి కొన్ని పనులకు సంబంధించి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు ప్రతిపాదనలు పంపామన్నారు. మైపాడు-నెల్లూరు రోడ్డు, కొరుటూరు, సోమరాజుపల్లి రోడ్డు నిర్మాణాలపై పంచాయతిరాజ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిశామని, త్వరలో అవి కూడా మంజూరు కానున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. కోవూరు-నెల్లూరు డబుల్ రోడ్డుకు, మైపాడు-నెల్లూరు, ముంబై-బళ్ళారి రోడ్లకు తాను, నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కేంద్రప్రభుత్వాన్ని కోరివున్నామన్నారు. దీనికి సంబంధించిన వివరాలను ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడికి దువ్వూరు కల్యాణ్‌రెడ్డి తెలియజేశారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రావూరు సర్పంచ్ వెంకటశేషయ్య, నాయకులు శ్రీకాంత్, కొండలరావు, గూడూరు ప్రభాకర్‌రెడ్డి, తిక్కవరపు సుధాకర్‌రెడ్డి, కైలాసం శ్రీనివాసులురెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, మహీధర్ రెడ్డి, షబ్బీర్, శ్రీనివాసులు, వెంకట్రామిరెడ్డి, మహిళా నేత దిల్షాద్, సర్పంచ్‌లు సురేంద్ర, వసుంధర తదితరులు పాల్గొన్నారు.



# అమెరికాలో ట్రంప్.. ఆంధ్రాలో బాబు

మొన్నీమధ్య అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ గురించి ఓ అమెరికన్ పత్రికలో చదివాను. అది చదువుతుంటే.. మన చంద్రబాబునాయుడు గుర్తుకు వచ్చారు. అక్కడ ఆయనా ఓడిపోయారు. ఇక్కడ ఈయనా ఓడిపోయారు. ఇద్దరూ దెబ్బయ్యవ పడిలోనే ఉన్నారు.కాకపోతే, ఓ రెండు, మూడు సంవత్సరాల తేడాలో ఉన్నారు. ట్రంప్‌కు నచ్చిందే తప్ప... ఎవరి సలహాలనూ తీసుకోరు. చంద్రబాబూ అంతే. ఎవరి సలహాలూ తీసుకోరు. ముందుగా ఓ నిర్ణయం తీసేసుకుని, పొలిట్ బ్యూరో అంటూ కథ నడిపిస్తారు. ఆయనకూ ప్రచార యావ ఎక్కువ. ఈయనకూ ఎక్కువ. రోజూ ఒకసారి అయినా... 'ఫాక్స్ న్యూస్' అనే టీవీ చానెల్‌లో మాట్లాడందే ఆయనకు నిద్ర పట్టేది కాదు. ఇక్కడా అంతే. రోజూ టీవీల్లో కనపడకపోతే, ఆరోజు ముగిసినట్టు కాదు. ఆయన సంతానానికీ రాజకీయ ఆకాంక్షలు ఎక్కువే. ఇక్కడా ఎక్కువే. అక్కడా అవి వర్కవుట్ కాలేదు. ఇక్కడా కాలేదు.

వీటన్నిటినీ మించి 2024లో తిరిగి అమెరికా అధ్యక్షుడు అవ్వాలని ట్రంప్ ఉవ్విళ్లూరుతున్నారు. ఇక్కడ, 2024లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కావాలనే బలమైన కోరికతో చంద్రబాబునాయుడు ఉన్నారు. మొన్నటి ఓటమి తరువాత, ట్రంప్ వాషింగ్టన్ నుంచి ఫ్లోరిడాకు తరలి వెళ్ళిపోతే చంద్రబాబునాయుడు మొన్నటి ఓటమి తరువాత విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. ఫ్లోరిడా నుంచి ట్రంప్ రిపబ్లికన్‌పార్టీని కంట్రోల్ చేస్తుంటే.. చంద్రబాబునాయుడు హైదరాబాద్ నుంచి తెలుగుదేశం పార్టీని తన కనుసైగలతో నడిపిస్తున్నారు. రిపబ్లికన్ పార్టీ నాయకులు ట్రంప్ చల్లని చూపులకోసం ఫ్లోరిడాకు వెళ్లి, ఆయన దర్శనం చేసుకుని వస్తుంటే... ఇక్కడా చంద్రబాబునాయుడు 'గుడ్‌లుక్స్'లో ఉండడానికి చాలా వినయ, విధేయతలతో ఉన్నట్టు నటిస్తున్నారు. అమెరికాలో ఓటర్లు ట్రంప్ అనుకూల, వ్యతిరేక వర్గాలుగా నిలువునా చీలిపోయి ఉన్నారు. ఇక్కడ మన రాష్ట్రంలోనూ ఓటర్లు చంద్రబాబు అనుకూల, వ్యతిరేక వర్గాలుగా విడిపోయి ఉన్నారు.

ఇలా వీరిద్దరికీ అనేక పోలికలు యాధృచ్ఛికంగానే అయినా... కనిపించాయి. అయితే...2024లో అమెరికా అధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి ట్రంప్ ఒక గట్టి ప్రయత్నమైతే ఎలా చేస్తారు అని అమెరికన్లు భావిస్తున్నారో... చంద్రబాబునాయుడు కూడా ముఖ్యమంత్రి కావడానికి అంతటి గట్టి ప్రయత్నమే చేస్తారని జనం భావిస్తున్నారు. అయితే... గతంలో అయినట్టుగా, ఈసారి ఏకపక్షంగా ముఖ్యమంత్రి కావడం చంద్రబాబుకు సాధ్యం కాకపోవచ్చు.

ఇప్పుడు.. జనం కోణం నుంచి చూసినప్పుడు, వైసీపీ చాలా బలంగా ఉంది. వారి బ్యాంక్ ఖాతాల్లో విడతల వారీగా డబ్బు జమ అవుతూనే ఉంటుంది. మొన్నటికి మొన్న.. వైఎస్సార్ వాహనమిత్ర పేరు మీద ఆటో, క్యాబ్, టాక్సీ ఓనర్లకు వారి ఖాతాల్లో మూడవ విడతగా తలా పదివేల రూపాయలు వేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుండడం, బాగుండకపోవడం, అప్పులు తేవడం, తేవకపోవడం మొదలైన వాటితో జనానికి సంబంధం లేదు. టైంకి వారి ఖాతాల్లో సొమ్ములు జమ అయిపోతున్నాయి. వైఎస్సార్ వాహనమిత్ర పథకం కింద డ్రైవర్లకు జమ చేసిన డబ్బును రాష్ట్ర దేవాదాయ శాఖ నిధుల నుంచి మళ్లించారు. చెప్పిన విధంగా డబ్బు తమ ఖాతాల్లో వేస్తున్నారనే భావన ఓటర్ల మస్తిష్కంపై చాలాపెద్ద ప్రభావం చూపిస్తుంది. వైసీపీ కాకుండా ఇక ఏ పార్టీ గెలిచినా... ఈ డబ్బు ప్రవాహం ఆగిపోతుందేమో అన్న భయానికి వారు లోనయ్యేంత బలంగా వైసీపీ ఉన్నది. బీజేపీ కేంద్ర నాయకత్వం అప్పటి పరిస్థితుల్లో వైసీపీతో కలిసి వెళ్ళాలి అనుకుంటే ఆ కాంబినేషన్‌ను ఎదిరించి, పోటీలో నిలవడం కోసం తెలుగుదేశం పార్టీ.. జనసేనతో అధికారికంగా కలిసి పోటీ చేయాలి. అయినా, బలం సరిపోదు. అలా కాకుండా జనసేన బీజేపీ కాంబినేషన్‌ను బలోపేతం చేయాలి అని బీజేపీ కేంద్ర నాయకత్వం అనుకుంటే త్రిముఖ పోటీలో తెలుగుదేశం నిలవలేదు. అసలు 175 నియోజకవర్గాలలోనూ అభ్యర్థులు కూడా దొరకకపోవచ్చు. ఒకవేళ, చంద్రబాబునాయుడు మాన్యుపులేటివ్ స్కిల్స్ వర్కవుట్ అయ్యి... బీజేపీ- జనసేన- టీడీపీ కలిసి... వైసీపీని ఎదుర్కొన్నాల్సి వస్తే.. చంద్రబాబునాయుడుని కేంద్ర బీజేపీ నేతలు ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తారు. 175లోనూ 60 సీట్లకు మించి పోటీ చేయనివ్వరు.




నిజానికి, ఇవన్నీ ఊహాజనిత ఆలోచనలే. ఏం జరుగుతుందో ఇప్పుడే ఎవరూ చెప్పలేరు. మనమే కాదు... మోదీ కూడా చెప్పలేరు, జగన్ కూడా చెప్పగల స్థితిలో లేరు. ప్రస్తుత రాజకీయాలు ఉయ్యాల లాగా అంతా ఊగిసలాటలో ఉన్నాయి. పార్టీల మధ్య సిద్ధాంత విభజన అంటూ ఏమీ లేకపోవడం ఇందుకు కారణం కావచ్చు.

కానీ, ఒక్కటి మాత్రం స్పష్టంగా కనపడుతున్నది. 'రైటింగ్ ఆన్ ది వాల్' అంటుంటామే అలాగన్న మాట. తెలుగుదేశం పార్టీ క్రమక్రమంగా బలహీనపడుతోంది. కేడర్ బేస్ట్ పార్టీయే అయినప్పటికీ వైసీపీ నుంచి ఇన్ని సవాళ్ళను ఎదుర్కొంటూ ఆ పార్టీని 2024లో తిరిగి అధికారంలోకి చంద్రబాబునాయుడు తీసుకు రాగలరనే నమ్మకం తెలుగుదేశం కార్యకర్తలు, కేడర్‌లో క్రమక్రమంగా సన్నగిల్లిపోతుంది. చంద్రబాబునాయుడు హైదరాబాద్‌లోని స్వగృహానికే దాదాపుగా పరిమితమైపోయి ఉండడం కూడా కార్యకర్తల మనోనిబ్బరాన్ని బాగా దెబ్బతీస్తున్నది. నాయకులు కూడా పళ్ల బిగువున బండి నడిపిస్తున్నారు. వారుకూడా మీడియా మీద ఎక్కువగా ఆధారపడుతున్నారు. ప్రజలలోకి వెళ్లడం తగ్గించేశారు. కొంతమంది అదీ చేయడం లేదు. బోండా ఉమ పేరు మీడియాలో చదివి గానీ, టీవీల్లో చూసిగానీ ఎంత కాలమైంది! కేశినేని నాని. ఆయన విజయవాడ ఎం.పీ. ఎక్కడా సౌండ్ చేయడం లేదు. యనమల రామకృష్ణుడో... అచ్చన్నాయుడో... సింబాలిక్‌గా... ఏదో విమర్శించాం అంటే.. విమర్శించాం అన్నట్టుగా మ.. మ.. అనిపిస్తున్నారు.

దీనంతటికీ కారణం.. వైసీపీ నగదు పంపిణీ వ్యూహం ఒక పక్క, టీడీపీ నేతలు దొరికినవారిని దొరికినట్టు తాట తీసే కార్యక్రమం మరో పక్క సాగిపోతున్న తీరు తెలుగుదేశం నేతలను, ముఖ్య కార్యకర్తలను ఉక్కిరి బిక్కిరి చేస్తుండడమే.

రాజకీయ ప్రత్యర్థులను వేటాడడం అనేది మన రాష్ట్రానికే పరిమితమైన రాజకీయ క్రీడ కాదు. బెంగాల్‌లో మమతా బెనర్జీ కాళికాదేవి అవతారం ఎత్తి... బీజేపీ వారు దొరికిన వారిని దొరికినట్టు అమ్మోరికి బలిస్తున్నది. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండి కూడా గుడ్లప్పగించి చూడడం తప్ప ఏమీ చేయలేకపోతున్నది. 35 ఏళ్లపాటు బెంగాల్‌ను అప్రతిహతంగా, అత్యంత పాశవికంగా, నియంతృత్వంగా పాలించిన కమ్యూనిస్టులకు...ఈ రోజున బెంగాల్ శాసనసభలో ఒక్కటంటే ఒక్క స్థానం లేదు. కేరళలో బీజేపీవాళ్ళు దొరికితే కమ్యునిస్టులు వదలడం లేదు

ఈ ఉదాహరణలన్నీ దేనికీ అంటే.. వైసీపీ ముందు టీడీపీ ఐడియాలు వర్కౌట్ కావు అని చెప్పడానికే.

అందుకే.. జగన్ బెయిల్ రద్దు చేయించి ఆ తరువాత వైసీపీని కకావికలు చేయించి ఎన్నికల నాటికి జగన్ రంగంలో లేని వైసీపీని ఓడించడం ద్వారా అధికారంలోకి రావచ్చునని చంద్రబాబు మాస్టర్ ప్లాన్ వేస్తున్నారని అనుమానించేవారికి కొదవలేదు. ఆ వ్యూహంలో ఎం.పి రఘురామరాజు చంద్రబాబుకు పరోక్షంగా కలిసి వస్తున్నారా అనే అనుమానాలు కూడా రాష్ట్రంలో లేకపోలేదు. అయినప్పటికీ మరోమారు చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం సాధ్యం కాదనే భావం పరిశీలకులలో బలంగా వ్యక్తమవుతున్నది.

ఎటువంటి పరిస్థితుల్లోనూ ప్రధాని మోదీ చంద్రబాబును దగ్గరకు రానివ్వరు. కనీసం ఆయన అప్పాయింట్మెంట్ లభించే పరిస్థితి కూడా లేదు. రాజకీయాలను ఆడిద్దామనుకునే 'రింగ్ మాస్టర్' చంద్రబాబు అయితే ఢిల్లీ సారు ఇంకా పెద్ద 'రింగ్ మాస్టర్'.

అందువల్లనే.. చంద్రబాబుకి ఇక ముఖ్యమంత్రి అయ్యే యోగం లేదని తెలుగుదేశం పార్టీలో సైతం చాలామంది నమ్ముతున్నారు. ప్చ్...అంటూ పెదవి విరుస్తున్నారు.

అయినప్పటికీ.. అమెరికాలో ట్రంప్ లాగా చివరి నిముషం వరకూ చంద్రబాబు రాజకీయాలలోనే కొనసాగుతూ ఉంటారు.' ఖబడ్దార్... మీ గుండెల్లో నిద్రపోతా...' అంటూ హైదరాబాద్ నుంచి వైసీపీని హెచ్చరిస్తూనే ఉంటారు. 'ఇంతకు...ఇంతా వడ్డీతో తిరిగి చెల్లిస్తా...' అంటూ జూమ్‌లో వేలెత్తి చూపిస్తూనే ఉంటారు. రోజూ ఓ రెండు సంతాప ప్రకటనలు... జగన్‌కు ఓ రెండు హెచ్చరికలు, రెండు హితవచనాలు, 'మనం ఎటు పోతున్నాం?' అంటూ ఓ రెండు ఆవేదనలతో చంద్రబాబుకు మంచి కాలక్షేపం అయిపోతున్నది, హైదరాబాద్‌లో... ట్రంప్‌కు గోల్ఫ్ కోర్ట్‌లో అవుతున్నట్టు.



భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com



# ఇక్కడ సీజె.. అక్కడ సీఎం





గత శుక్రవారం జూన్11న సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యన్.వి రమణ తిరుమలకు వచ్చారు. సుప్రీం ప్రధాన న్యాయ మూర్తిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలి సారిగా ఆయన రాష్ట్రానికి వచ్చారు. అదేరోజు ఆంధ్రా ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ వెళ్లారు. జగన్ ఢిల్లీకి వెళ్ళకుండా ఉండి ఉంటే ఏం జరిగుండేదో మనకు తెలియదు. కానీ, ప్రధాన న్యాయమూర్తిని స్వాగతించడానికి రాష్ట్ర మంత్రులు కూడా ఎవరూ తిరుపతి వెళ్ళలేదు. టిటిడి చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డితో పాటు టిటిడి అధికారులూ, తిరుపతి శాసన సభ్యులు భూమన కరుణాకరరెడ్డిలు రమణకి స్వాగతం పలికారు. కేంద్ర మంత్రులు తిరుమల పర్యటనకు వచ్చిన సందర్భాలలో స్వాగతించ డానికి పోటీపడే రాష్ట్ర నేతలు ప్రధానన్యాయ మూర్తి పర్యటనకు దూరంగా ఉండడం ఇప్పుడు రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇక్కడినుండి హైదరాబాదుకి వెళ్లిన యన్.వి. రమణకు అక్కడ ముఖ్యమంత్రి బ్రహ్మాండమైన స్వాగత సత్కారాలు చేశారు.

మొత్తానికి మొన్న శుక్ర, శనివారా లలో ఇక్కడ (ఏపిలో) సీజె... అక్కడ (ఢిల్లీలో) సీఎం చేసిన పర్యటనలు ప్రాధాన్యతను సంత రించుకున్నాయి.





# 'టాటా కెమికల్స్' వారి ఔదార్యం


## • 12 లక్షల విలువైన ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ల వితరణ

మండల కేంద్రమైన తడ సమీపంలోని మాంబట్టులో ఉన్న టాటా కెమికల్స్ వారు జిల్లాలో కరోనా బాధితులకు అవసరమైన 12 లక్షల రూపాయల విలువైన ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను ఇటీవల జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుకు వితరణగా అంద జేశారు. జిల్లాలో కోవిడ్ నియంత్రణకు ఆ ఫ్యాక్టరీ వారు తమవంతు సహకారం అందించినందుకు జిల్లా కలెక్టర్ వారిని అభినందించారు. వీటిని జిల్లాలోని కోవిడ్ ఆసుపత్రులకు, కోవిడ్ కేర్ సెంటర్లకు పంపిస్తామన్నారు. టాటా కెమికల్స్ హెడ్ సురేష్, ఏ.ఓ సతీష్, జనరల్ మేనేజర్ మారుతిప్రసాద్ పాల్గొన్నారు.



# కొరుటూరు బాధితులకు చేయూత

ఇందుకూరుపేట మండలంలోని కొరుటూరు గిరిజన కాలనీలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన ఓ గిరిజన కుటుంబానికి నెల్లూరులోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, దుప్పట్లు వగైరా సామగ్రిని అందజేశారు. ఎస్సీఎస్టీ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు చెంచయ్య, సంపత్, రత్నం, వేణుగోపాల్, మధు, రవి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# ‘అన్న’ంటే.. మా జగనన్నే!

## ‘వాహనమిత్ర’ పథకంతో డ్రైవర్లలో ఆనందం

***‘మాకు ఒకవేళ సొంత అన్న ఉన్నా ఇంత సాయం చేసేవాడో లేదో మాకు తెలియదు. కానీ మాకు ఈ కరోనా కష్టకాలంలో జగనన్న చేసినంత సాయం ఇంకెవరూ చేయలేదు’.. అంటూ అనేకమంది వాహన డ్రైవర్లు ఎంతో సంతోషంతో చెప్తున్నారు. సొంత ఆటో, టాక్సీ, మ్యాక్సీ క్యాబ్‌లు ఉన్న డ్రైవర్లకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటూ వారికి మూడోవిడత సాయంగా ఈనెల 15న 10 వేల రూపాయల వంతున వారి బ్యాంకు ఖాతాల్లో జమచేయడంతో వాహనాల డ్రైవర్లు ఆనందంతో ముఖ్యమంత్రిని కొనియాడుతున్నారు.***



పాదయాత్రలో ఏలూరు సభలో ఇచ్చిన మాట ప్రకారం యువనేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వాహనడ్రైవర్లకు చేయూతగా ‘వాహనమిత్ర’ పథకం ద్వారా ఒక్కొక్కరికి 10వేల రూపాయల వంతున సాయం అందజేసి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఈనెల 15న అమరావతిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి వాహనమిత్ర మూడోవిడత సాయంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 2.48 లక్షల మందికి 248.47 కోట్ల రూపాయలను లబ్దిదారుల ఖాత్లో జమచేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ మాట్లాడుతూ ‘ఇది మీ అన్న ప్రభుత్వం. మీ తమ్ముడి ప్రభుత్వం అని గుర్తుపెట్టుకోండి. రాష్ట్రంలో 2.48లక్షల మందికి అందిస్తున్న ఈ సహాయంలో ఎక్కడా ఎలాంటి వివక్షలేదు. అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సాయం అందిస్తున్నాం’ అంటూ అందరి కరతాళధ్వనులందుకున్నారు.

### జిల్లాలో 18,956 మందికి లబ్ది - కలెక్టర్ చక్రధర్‌బాబు

జిల్లాలో వాహనమిత్ర పథకం కింద 18,965 మందికి లబ్ది చేకూరిందని, మొత్తం 18,95,50,000 రూపాయలు వారి ఖాతాల్లో జమ చేశారని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు చెప్పారు. అనంతరం వాహన డ్రైవర్లకు వాహనమిత్ర పథకం ద్వారా నమూనా చెక్కును అందజేశారు. ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, రవాణాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఛీఛీ!.. కోళ్ళ గబ్బులో మద్యం సీసాలు

## ఎస్ఇబి అధికారుల తనిఖీల్లో బయటపడ్డ బండారం



ఏదోవిధంగా డబ్బు సంపాదించాలనే తాపత్రయం తప్ప కొందరు అక్రమార్కులకు ఉచ్ఛం..నీచం అన్నది కూడా తెలియడం లేదు. చివరికి కంపుకొట్టే కోళ్ళ వ్యరాల చాటున కూడా మద్యం అక్రమ రవాణాకు పాల్పడుతూ జిల్లా పరువు తీసేస్తున్నారు. తనిఖీ అధికారులు ఒకవేళ వాహనం ఆపినా కోళ్ల వ్యర్థాల గబ్బు తట్టుకోలేక రైట్‌రైట్ అని చెప్పేస్తారని వాళ్ళనుకున్నట్లుంది. అయినా, అసలే ఈ కరోనా కాలంలో ఆ వ్యర్థాల మురుగుడు గబ్బులో మద్యం సీసాలు దాచిపెట్టి రవాణా చేయడం ఎంత అసహ్యం!..కానీ ధనాశతో వారికా గబ్బే సుగంధపు సువాసనలా ఉన్నట్లుంది. జిల్లాలో మద్యాన్ని అక్రమంగా తరలించడాన్ని అరికట్టేందుకు అధికారులు ఎంతగా ప్రయత్నాలు చేస్తున్నా రవాణా దారులు మాత్రం ఇలా రకరకాల ఎత్తులు వేస్తూ మద్యాన్ని ఏదోవిధంగా అక్రమంగా తరలిస్తూనే ఉన్నారు. ఈనెల13న ఎస్ఇబి అధికారులు, ఎక్సైజ్ పోలీసుల తనిఖీల్లో ఈ బండారం బయటపడింది. పొరుగు రాష్ట్రమైన బెంగుళూరు నుంచి మద్యం సీసాలు తెచ్చి కొడవలూరు మండలంలోని రేగడిచెలిక గ్రామంలో దాచిపెట్టి చాటు మాటుగా విక్రయించుకుంటున్నారనే సమాచారం తెలుసుకున్న ఏస్ఇబి జేడీ శ్రీలక్ష్మి ఆదేశాలతో ఎక్సైజ్ సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేసి ఆ అక్రమ మద్యాన్ని పట్టుకున్నారు. కోళ్ళ వ్యర్థాలను నిండుగా పోసి, వాటి అడుగు భాగంలో మద్యం బాటిళ్ళను కనపడ కుండా దాచిపెట్టి ఉండడాన్ని పోలీసులు చూసి ఆశ్చర్యపోయారు.

దాదాపు లక్షా 33వేల రూపాయలు విలువచేసే ఆ బెంగుళూరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ ప్రభాకర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

# డాక్టర్లపై దాడులు దారుణం

## ఐఎంఏ నాయకుల ఆవేదన

ఈ కరోనా కష్టకాలంలో ప్రాణాలను పణంగా పెట్టి కోవిడ్ రోగులకు సేవలందిస్తున్న వైద్యులపై దాడులు చేయడం దారుణమని, వైద్యులపై దాడులు చేసేవారిని కఠినంగా శిక్షించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) నాయకులు పేర్కొన్నారు. ఈనెల 15న నెల్లూరులోని ఐఎంఏ హాల్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఐఎంఏ నాయకుడు డాక్టర్ అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసతేజ, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కొన్నిచోట్ల కరోనా రోగుల ఆరోగ్యపరిస్థితి విషమించి రోగులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, ఇలాంటి సమయంలో డాక్టర్లపై దాడులు చేయడం ఎంతవరకు సబబని వారు ఆందోళనగా ప్రశ్నించారు. డాక్టర్లపై దాడులను నిరసిస్తూ ఈనెల 18న జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. కరోనా రోగులకు సేవలందిస్తూ మరణించిన డాక్టర్ల కుటుంబాలకు కోటి రూపాయల వంతున పరిహారం అందించాలని వారు కోరారు. ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎంపిఎస్ రెడ్డి, డాక్టర్ రూపేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




# గూడూరు డివిజన్ వార్తలు

## అండర్ బ్రిడ్జికి
## ఐరన్‌షీట్‌లు ఏర్పాటు చేయండి
### - రైల్వే ఎస్పీకి సీపీఐ, ఇన్సాఫ్ కమిటీల వినతి



గూడూరు పట్టణంలోని రెండవ అండర్ బ్రిడ్జికి ఐరన్ షీట్లు ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఐ, ఇన్సాఫ్ కమిటీల ఆధ్వర్యంలో ఈ నెల 14న గూడూరు రైల్వే జంక్షన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ ప్రభాకర్ మాట్లాడుతూ రైల్వే మూడవ లైన్ నిర్మాణంలో భాగంగా గూడూరు రెండు పట్టణాలకు అనుసంధానంగా ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి-1ని మూసివేయడంతో అంబేడ్కర్‌నగర్‌లోని రెండవ అండర్ బ్రిడ్జి నుండి వాహన రాకపోకలు కొనసాగుతుండగా... రెండవ అండర్ బ్రిడ్జికి పట్టాల కింద వైపున ఐరన్ షీట్లను ఏర్పాటు చేయకపోవడంతో రైళ్లలోని వ్యర్థాలు, సెప్టిక్ ట్యాంక్ నీళ్లు అండర్ బ్రిడ్జి కిందనుండి వెళ్లే వాహనచోదకులపై పడే అవకాశం ఉందన్నారు. దీంతో వాహనదారులు రైళ్ల రాకపోకల సమయంలో వాహనాలను బ్రిడ్జికి ఇరువైపులా నిలిపేస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రైల్వే రెండవ అండర్ బ్రిడ్జికి ఐరన్ షీట్లను ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి స్పందించిన రైల్వే సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆండర్ బ్రిడ్జికి ఐరన్ షీట్ల ఏర్పాటు 15 రోజులలో చేస్తామని తెలిపారు. సీపీఐ పట్టణ కార్యదర్శి షేక్ కాలేషా, ఇన్సాఫ్ కమిటీ డివిజన్ అధ్యక్షులు షేక్ జమాలుల్లా, ఏఐటీయుసీ నాయకులు ఎంబేటి చంద్రయ్య, ఇన్సాఫ్ కమిటీ గూడూరు డివిజన్ ప్రధాన కార్యదర్శి షేక్. ఉమర్, సభ్యులు షేక్. హైదర్ అలీ, షేక్. రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి సజ్జల రామకృష్ణారెడ్డి జన్మదినం సందర్భంగా ఈ నెల 16వ తేదీ అమరావతి వెలగపూడిలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కేక్ కట్ చేసి తినిపిస్తున్న వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి

## శ్రీకంఠం సేవలు ప్రశంసనీయం



42 ఏళ్ళుగా ప్రజలకు సేవలందించి పదవీ విరమణ పొందిన పోస్టల్ బ్రాంచ్ మేనేజర్ శ్రీకంఠం హనుమంతరావు సేవలు ప్రశంసనీయమని సర్వేపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్, కార్యదర్శులు సర్వేపల్లి రామమూర్తి, సర్వేపల్లి శివకుమార్‌లు అన్నారు. మండలంలోని గురివిందపూడి గ్రామంలో మంగళవారం బిపియం దంపతులకు శాలువ కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమంతరావు బిపియంగా గురివిందపూడి, అనుపల్లిపాడు, రామదాసు కండ్రిగ, జంగాలకండ్రిగ గ్రామాలలో ఎనలేని సేవలు అందించారన్నారు. ఆయనని మార్గదర్శకంగా తీసుకోవాలని కోరారు. పలువురు ఆయన సేవలను కొనియాడారు.

ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు బాలకృష్ణమూర్తి, గ్రామ పెద్దలు అన్నారెడ్డి సుబ్బారెడ్డి, శ్రీకంఠం శివకుమార్, చేవూరు వెంకటేశ్వర్లు, కుటుంబసభ్యులు చెన్నూరు శ్రీనివాసరావు, మాధవి, వెంకట సాయి, రాజీవ్, శ్రీరమ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీ ప్రగతి ప్రశంసనీయం
### - సబ్ కలెక్టర్ గోపాలకృష్ణ



గూడూరు సబ్ కలెక్టర్ గోపాలకృష్ణ ఈనెల 14న శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదరంగా స్వాగతం పలికి శ్రీసిటీ ప్రగతిని వివరించారు. శ్రీసిటీ పారిశ్రామికవాడను కాలుష్య రహిత ప్రాంతంగా కొనసాగించడానికి చేస్తున్న పలు కార్యక్రమాలను, ప్రధానంగా కరోనా కట్టడికి తీసుకుంటున్న చర్యలను సబ్ కలెక్టర్‌కు తెలియజేశారు. అనంతరం శ్రీసిటీ పరిసరాలను సబ్ కలెక్టర్ సందర్శించి శ్రీసిటీ మౌలిక వసతులు, పారిశ్రామిక అభివృద్ధి ఎంతో బావున్నాయంటూ ప్రశంసించారు.

## ఏరియా ఆసుపత్రికి లయన్స్ ఆక్సిజన్

గూడూరు ఏరియా ప్రభుత్వ వైద్యశాలలోని 30 ఆక్సిజన్ సిలిండర్లను లయన్స్ క్లబ్ సభ్యుల సహకారంతో ఇటీవల రీఫిల్ చేసి ఇవ్వడం జరిగింది. గూడూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ యం.రూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాస్ట్ రీజియన్ చైర్మన్ లయన్ యస్.కె.రియాజ్ అహ్మద్, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ రామకృష్ణ, వైద్యశాల ఆర్.యం.ఒ శైలజ, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ జె.సురేష్ బాబు, యం.వి.రమణయ్య, డాక్టర్ కె.చంద్రహాస్, పి.వి.జగదీష్‌చంద్ర, యస్.కె.మస్తాన్, ఎ.కళ్యాణ్‌సాయి, ఆర్.రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.



# శరణాగత రక్షకుడు.. గూడూరు 'శ్రీ ప్రసన్న వేంకటేశ్వరుడు'





మన దేవాలయాలు (52)


'వేంకటాద్రి సమం స్థానం..బ్రహ్మాండే నాస్తి కించన, వేంకటేశ సమో దేవో నభూతో న భవిష్యతి' అంటున్నాయి మన వేదాలు. వేంకటాద్రికి సమమైన స్థానం కానీ, వేంకటేశ్వరస్వామి కంటే సమమైన దేవుడు కానీ ఈ బ్రహ్మాండంలోనే లేదన్నది దీని భావం. 'కలౌ వేంకటనాయక:' అన్నట్లుగా ఈ కలియుగంలో ప్రత్యక్ష దైవం ఆ శ్రీ వేంకటేశ్వరుడే. ఆపదమొక్కులవాడు, ఏడుకొండలవాడు, ఆపద్బాంధవుడు, భక్తవరదుడు.. శరణాగత రక్షకుడు.. అన్నీ ఆయనే. అందుకే అనేక ప్రాంతాల్లో శ్రీ వేంకటేశ్వరస్వామికి కోవెలలు కట్టి భక్తజనం పూజలు చేస్తూ ఉంటారు. నెల్లూరుజిల్లాలోని గూడూరు పట్టణం లోనూ తిరుమలేశునికి అద్భుతమైన ఆలయం ఉంది. అదే శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయం. ఎంతో ప్రాచీనమైన ఈ ఆలయం తిరుమలలో ఉన్నట్లుగానే ఎంతో అపూర్వమైన రీతిలో నెలకొల్పబడి ఉండడం ఇక్కడి విశేషం.

## ఆలయ చరిత్ర :

దాదాపు ఆరువందల సంవత్సరాలకు పూర్వం పల్లవరాజుల కాలంలో అద్వితీయమైన రీతిలో శిల్పకళాశోభితంగా శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయాన్ని నిర్మించారు. ఆ కాలంలో విక్రమసింహపురి (నెల్లూరు) సీమ మీదుగా తిరుమలకు వెళ్ళే యాత్రికులకు అనువుగా ఈ ప్రాంతంలో భక్తులు విశ్రమించేందుకు గుడారాలు వేసి ఉంచేవారు. అందువల్ల అప్పట్లో ఈ ఊరిని 'గుడారాల ఊరు'గా పిలిచేవారని, ఆ తర్వాత అదే గూడూరుగా మారిందని కూడా అంటారు. గూడూరు పట్టణంలో నిర్మితమై ఉన్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారి ఆలయం తిరుమల ఆలయంలో వలెనే అత్యద్భుతంగా ఉండడంతో తిరుమలేశుని భక్తులు ఈ ఆలయాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో దర్శించుకునేవారు. సుప్రశాంతమైన ఆధ్యాత్మిక వాతావరణంలో ఉన్న ఈ ప్రాచీనమైన ఆలయం అనాదిగా భక్తుల పూజలందుకుంటూ ఉంది. గర్భాలయంలో శ్రీ వేంకటేశ్వరుని వక్షస్థలంలో కొలువై ఉన్న శ్రీ మహాలక్ష్మీదేవితో పాటు అయిదడుగుల స్వామివారి అత్యంత సుందరమైన స్వర్ణ మణిమయమూర్తిని ఎంతసేపు చూసినా ఇంకా చూడాలని అనిపిస్తూ ఉంటుంది. స్వర్ణాభరణాలు, నాగాభరణాలతో, పుష్ప మాలికల శోభలతో, ఎంతో అమూల్యమైన పచ్చలు పొదిగిన స్వర్ణకిరీటంతో శ్రీ వేంకటేశ్వరుడు అత్యంత ప్రసన్న వదనుడై భక్తులను తన వరదహస్తంతో కటాక్షిస్తుంటాడు. ఈ ఆలయాన్ని దర్శించుకున్న భక్తులకు సాక్షాత్తూ ఆ తిరుమల శ్రీనివాసుని దర్శించుకున్నంత అనుభూతి కలుగుతుందంటే అతిశయోక్తి కాదు. ఇంతటి విశేషమైన శ్రీ స్వామివారి దర్శనం పూర్వజన్మ సుకృతంగా, మహద్భాగ్యంగా భక్తులు భావిస్తుంటారు. ఆలయంపై విమానగోపురం మీద శ్రీనివాసుడు 'విమాన వేంకటేశ్వరుడు'గా కొలువై ఉన్న తీరు.. అంతా తిరుమల ఆలయంలో ఉన్నట్లుగానే ఉండడం ఇందులోని విశిష్టత. ప్రాచీనకాలంలో తిరుమలకు వెళ్ళి ఆ ఏడుకొండలస్వామి దర్శనం చేసుకోవాలంటే ఎంతో కష్టసాధ్యంగా ఉండేది. ఆ లోటును కొంతైనా తీర్చాలనే సదాశయంతో నాటి కాలంలో పల్లవ రాజులు ఈ ఆలయాన్ని అత్యంత సుందరంగా నిర్మించినట్లు చరిత్ర పేర్కొంటోంది. కాలక్రమంలో ఈ ఆలయం శిథిలమైపోవడంతో ఇటీవలి కాలంలో గూడూరు పట్టణంలోని దాతలు, భక్తులంతా కలసి మళ్ళీ ఆలయాన్ని పునరుద్ధరించారు. 1994లో చిన్నజీయర్‌స్వామి చేతుల మీదుగా జీర్ణోద్ధరణ గావించి, 1996 నాటికి ఆలయాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు.

## ఆకట్టుకునే శిల్పాలు

దేవాలయం గోడలపై, ముఖమండపాలపై అంతా విష్ణురూప శిల్పాలు ఆలయానికి మరింత శోభను చేకూరుస్తుంటాయి. తిరుమలేశుని ఆవిర్భావానికి సంబంధించిన శిల్పాలు, క్షీరసాగరంలో శ్రీమహావిష్ణువు శేషతల్పశాయిగా పవళించి ఉండడం తదితర శిల్పాలతో పాటు, నాలుగంతస్తుల భారీ రాజగోపురం, పెద్ద ధ్వజస్తంభం, ఏకశిలతో నిర్మించిన మరో అరుదైన గరుడ స్తంభం, ధ్వజస్తంభం పీఠభాగంలో శ్రీ దాసాంజనేయస్వామి విగ్రహమూర్తి, గర్భగుడి పైభాగాన శంఖుచక్రాలతో తిరునామాలు.. ఇలా ప్రతి నిర్మాణం ఎంతో చక్కగా రూపుదిద్దారు. ఆలయంలో మరో వైపు శ్రీ మహాలక్ష్మీదేవి అమ్మవారి మందిరంతో పాటు, గోదాదేవి మందిరం, ఆళ్వార్ల మందిరం, వినాయకుని గుడి తదితర ఉపాలయాలు ఎంతో విశిష్టమైన రీతిలో నిర్మించారు. ఆలయంలో పూజలన్నీ తిరుమల ఆలయంలో జరిగినట్లుగానే వైఖానస ఆగమోక్తంగా జరుగుతుంటాయి. ప్రతి శనివారం స్వామివారికి సుప్రభాతసేవ, విష్ణు సహస్రనామ పారాయణంతో పాటు విశిష్ట పూజలు సేవలు జరుగుతుంటాయి. గురువారం నేత్ర దర్శనం, శుక్రవారం రోజుల్లో శ్రీ స్వామి వారి నిజపాద దర్శనం, అభిషేకాలు నిర్వహిస్తుంటారు. అదేవిధంగా శ్రీ మహాలక్ష్మి దేవి అమ్మవారికి కూడా కుంకుమ పూజలు, విశేష పూజలు చేస్తుంటారు. ప్రతి ఏడాది జ్యేష్ఠ మాసంలో నవాహ్నిక దీక్షతో తొమ్మిది రోజుల పాటు శ్రీస్వామి వారికి అంగరంగ వైభవంగా జరిగే బ్రహ్మోత్సవాలకు పెద్దసంఖ్యలో భక్తజనం తరలివస్తుంటారు. ఏదేమైనా.. కరుణా సముద్రుడైన శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామిని భక్తితో దర్శించుకుంటే చాలు.. జీవితంలో అన్ని కష్టాలు తీరిపోయి..సకల శుభాలు కలుగుతాయి.



# కరోనా కట్టడికి.. ఆయుర్వేదం భేష్

## 'ఆయుష్' మందులు ఎంతో ఉపయోగం

**- ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి వినోద్‌బాబు**

కరోనా నియంత్రణకు ఆయుర్వేద ఔషధాలు ఎంతో మంచివని, అందులోనూ ప్రజల ఆరోగ్యం కోసం ఆయుష్ శాఖ అందజేస్తున్న మందులు ఎంతో ఉపయోగకరమైనవని, వీటిని ముందస్తుగా వాడితే వ్యాధి నిరోధకశక్తి పెరిగి కరోనాకు చెక్ పెట్టవచ్చుని ప్రభుత్వ ఆయుర్వేద అధికారి డాక్టర్ వినోద్‌బాబు చెప్పారు. నెల్లూరు మూలాపేటలో ఉన్న జిల్లా ఆయుర్వేద ఆసుపత్రిలో ఆయన ఇటీవల విలేకర్లతో మాట్లాడుతూ ప్రకృతి వనమూలికలతో తయారుచేసి తాము ఇస్తున్న ఆయుర్వేద మందుల వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని స్పష్టం చేశారు. కరోనా చికిత్స కోసం ఎంతో సమర్థవంతమైన మందులను ఆయుష్ శాఖ సిద్ధం చేసిందన్నారు. వ్యాధినిరోధకశక్తి పెంచేందుకు, కరోనాను నివారించేందుకు ఆయుర్వేదంలో అగస్త్యహరితకి, చ్యవనప్రాశ లేహ్యం, సంశమనవటి, సుదర్శనవటి వంటి మందులతో పాటు అశ్వగంధ మాత్రలు కూడా కరోనాను నివారిస్తాయని.. ఇవన్నీ కూడా కరోనా బాధితులకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. తిప్పతీగతో తయారుచేసిన సంశమనవటి మందు కోవిడ్ వల్ల తీవ్రస్థాయిలో పెరిగిపోయిన ఆక్సిజన్ లెవల్స్‌ను సాధారణ స్థితిలోకి తీసుకువస్తుం దన్నారు. వేలాదిమందికి ఈ మందులను ఇచ్చి పరిశీలించడం కూడా జరిగిందని, ఈ మందులను వాడుకుంటున్న వాళ్ళంతా ఎంతో ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. కరోనా సోకి కోలుకున్నాక వచ్చే సమస్యలకు కూడా ఆయుర్వేదంలో అగస్త్యహరితకి వంటి అద్భుతమైన మందులున్నాయని పేర్కొన్నారు.



ఈ మందులకు సంబంధించిన వివరాలు లేదా వైద్యసలహాల కోసం ఆయుష్ రాష్ట్ర కమిషనర్ ఆదేశాలతో జిల్లాలో కాల్‌సెంటర్‌ను కూడా ఏర్పాటు చేశామని, సంప్రదించదలచుకున్నవారు 91339 66832 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. నగరంలోని మూలాపేటలో ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో తాము అందుబాటులో ఉంటామని, కోవిడ్ పరంగా ఎలాంటి సమస్యలున్నా సంప్ర దించవచ్చని పేర్కొన్నారు. ఇదే ఫోన్ నెంబర్‌తో వాట్సప్ ద్వారా కరోనా నియంత్రణకు సంబంధించిన వివరాలు కూడా ఉంటాయని తెలిపారు.

### ఎంతకాలమైనా..

# మా సమస్యలు పట్టించుకోరేం?

**పారిశుద్ధ్య కార్మికుల 'ధర్నా'ందోళన**

ఎంతోకాలంగా తమ సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని, ఇకనైనా ప్రభుత్వం తమ కష్టాలు తీర్చాలంటూ పారిశుద్ధ్య కార్మికులు నెల్లూరులో ఈనెల 14న విధులకు హాజరుకాకుండా నిరసన వ్యక్తం చేస్తూ నగరంలో పలుచోట్ల ఆందోళనలు నిర్వహించారు. సిఐటియు ఆధ్వర్యంలోని మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నేతృత్వంలో నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట, పాత మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నాలు చేపట్టారు.

ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, మూలం రమేష్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు దిగుతామన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ఇంతవరకు పర్మనెంట్ చెయ్యలేదని, ఇకనైనా వారిని పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల జీతాల్లో పట్టుకుంటున్న పిఎఫ్, ఇఎస్ఐలకు సంబంధించిన కోట్లాదిరూపాయల నగదు కార్మికుల ఖాతాల్లో జమ కావడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ సేవలందిస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి అవసరమైన మాస్కులు, గ్లౌజులు వంటి రక్షణ పరికరాలను కూడా సక్రమంగా ఇవ్వకపోవడం దారుణమన్నారు. కరోనాతో మరణించినవారి కుటుంబాలకు 50 లక్షల వంతున బీమా చెల్లించాలని కోరారు. సిఐటియు నాయకులు నాగేశ్వరరావు, కత్తి శ్రీనివాసులు, పెంచలనరసయ్య, బత్తల కిష్టయ్య, సూర్యనారాయణ, గౌస్‌బాషా, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### చల్లా యానాదులకు..

# సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సాయం

**90 కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేత**

కరోనా నేపథ్యంలో పనులు లేక జీవనం గడవక ఇబ్బందులు పడుతున్న 90 కుటుంబాల చల్లా యానాదులకు బెంగుళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగిగా ఉన్న సైదాపురం నివాసి రాపూరు శ్రీనివాసులురెడ్డి తనవంతు సాయంగా నిత్యావసర సరుకులు, కూరగాయలు అందజేసి తన వితరణగుణాన్ని చాటుకున్నారు. రాపూరులోని తూర్పు అగ్రహట్ట, సాయి గిరిజన కాలనీ, మసీదుపేట ఎస్‌టి కాలనీల్లో నివసిస్తున్న నిరుపేదలకు ఈ సాయం అందించారు. ఒక్కో కుటుంబానికి 20 కేజీల బియ్యంతో పాటు నూనెలు, యరగడ్డలు, కందిపప్పు, చింతపండు, పసుపు, మిరప్పొడి, కూరగాయలు వగైరాలు పంపిణీ చేశారు. కరోనా కష్టకాలంలో చల్లా యానాదులు, నిరుపేద గిరిజనులు పడుతున్న అవస్థలను గమనించి ఈ సాయం అందజేయడం జరిగిందని శ్రీనివాసులురెడ్డి తెలిపారు. సిండికేట్ బ్యాంక్ మేనేజర్ విరాట్‌సారథి చేతుల మీదుగా వాటిని పంపిణీ చేశారు. గిలకపాడు గ్రామ సర్పంచ్ కేతా అమర్‌నాథ్‌రెడ్డి, జెమ్స్ స్కూల్ కరెస్పాండెంట్ బులగాకుల మునీంద్రరెడ్డి, జనార్దన్‌రెడ్డి, స్నేహ హస్తం ఫౌండేషన్ ప్రతినిధులు దందోలు తిలక్‌చంద్‌రెడ్డి, రేవూరు శ్రీనివాసులు, కెవి బాలప్రసాద్, బండి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అనాథాశ్రమాల్లో ఉన్నవాళ్ళకి.. టీకా

జిల్లాలోని వివిధ అనాథాశ్రమాల్లో ఉన్న వాళ్ళందరికీ త్వరలోనే కరోనా నివారణకు టీకా వేయనున్నట్లు డిఎంఅండ్‌హెచ్ఓ రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అనాథాశ్రమాల్లో ఉన్న నిరాశ్రయులకు ఆధార్ కార్డు ఉన్నా..లేకపోయినా వారికి టీకా వేస్తామన్నారు. కోవిడ్ టీకాను అందరూ వేయించుకుని కరోనాకి దూరంగా ఉండాలన్నారు.

### శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో..

# ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఉత్సవాలు

నాయుడుపేటలోని శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 18వ తేది నుంచి మూడురోజుల పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు కోవిడ్ నిబంధనలకు అనుగుణంగా జరుగనున్నాయని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చదలవాడ మోహన్‌కృష్ణశర్మ తెలిపారు.




కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' పత్రిక

40 లాయర్ YEARS

నిష్పక్షపాత వార్తా సంకలనం
స్థానిక పత్రికా రంగంలో సంచలనం
లాయర్
వారపత్రికకు
40వ వార్షికోత్సవ అభినందనలు.

వల్లూరు రవీంద్రకుమార్‌రెడ్డి & ఫ్యామిలి
శుభాకాంక్షలు



కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' పత్రిక


40 లాయర్ YEARS

ఉద్యమ స్ఫూర్తితో ఊపిరి పోసుకుని
పోరాట ప్రతిమతో ఉరకలు వేస్తున్న
లాయర్
వారపత్రికకు
40వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

ఆల్తూరు మహేష్‌రెడ్డి
మేనేజింగ్ డైరెక్టర్



AMR

AMR INDIA LIMITED
PIONEERS IN MINING & OTHER INFRASTRUCTURE PROJECTS
"Sai Krupa", D.No. 8-3-833, Plot : 37&38, Phase-1,
Kamalapuri Colony, Hyderabad - 500 073.
Tel : +91-40-3057 0009, Fax : +91-40-3057 0012.
email : info@amrgroup.in, www.amrgroup.in


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com